
ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY
5

విజయనగరం
జిల్లా వార్తలు
మంగళవారం 28 జనవరి 2025




# ప్రజా సమస్యల పరిష్కారానికి ప్రాధాన్యమిచ్చేలా..

- నేడు 'అక్షరం అండగా.. పరిష్కారమే అజెండాగా'
- 'ఆంధ్రజ్యోతి-ఏబీఎన్' ఆధ్వర్యంలో నిర్వహణ
- 43వ డివిజన్, ఉడాకాలనీ గాంధీ పార్కు వద్ద సభ
- హాజరుకానున్న ఎమ్మెల్యే అదితిగజపతిరాజు, కమిషనర్ నల్లనయ్య
- ప్రజా సమస్యల పరిష్కారానికి 'ఆంధ్రజ్యోతి' సమాయత్తం



## అక్షరం అండగా.. పరిష్కారమే అజెండాగా..

విజయనగరం/టౌన్, జనవరి 27(ఆంధ్రజ్యోతి): అక్షరమే ఆయుధంగా ఎన్నో ప్రజా సమస్యల పరిష్కారంలో కీలక భూమిక పోషించిన ఆంధ్రజ్యోతి మరో బృహత్తర కార్యక్రమానికి శ్రీకారం చుడుతోంది. ఇప్పటివరకు ప్రజా సమస్యలను అక్షర రూపంలో వెలుగులోకి తీసుకువచ్చింది. ఈ పంథా కొనసాగిస్తూనే మరో కొత్త కార్యక్రమం ద్వారా ప్రజా గొంతుకుగా మారి వారి సమస్యల పరిష్కారానికి ఆచరణీయ పద్ధతిలో ముందుకు కదలనుంది. దీనిలో భాగంగా "అక్షరం అండగా... పరిష్కారమే అజెండాగా" సదస్సుల నిర్వహణకు నిర్ణయించింది. తొలిగా విజయనగరంలోని 43వ డివిజన్ ఉడాకాలనీ ఫేజ్-2లో గాంధీ పార్కు వద్ద మంగళవారం ఉదయం 9 గంటలకు సదస్సు నిర్వహించనుంది. సమస్యలతో సతమతమవుతున్న ప్రజలకు అండగా నిలుస్తూ వారి సమస్యలను ప్రజాప్రతినిధులు, అధికారుల దృష్టికి తీసుకువచ్చేందుకు ఈ సదస్సు ఉపయోగపడనుంది. కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా విజయనగరం ఎమ్మెల్యే పూసపాటి అదితిగజపతిరాజు, నగరపాలక సంస్థ కమిషనర్ పి.నల్లనయ్య, పోలీస్, విద్యుత్, ఇతర శాఖల అధికారులు హాజరుకానున్నారు.

# ఏం మారలేదు!

- అక్రమణల్లో గెడ్డలు, చెరువులు
- నాడు వైసీపీ నేతల ప్రోత్సాహంతో నిర్మాణాలు
- నేడు తొలగించలేకపోతున్న అధికారులు
- ఆంధ్రజ్యోతి కథనాలతో కొన్నిచోట్ల అడ్డుకట్ట

గత ఏడాది జనవరి మొదటివారంలో వైసీపీ నేత అండతో శృంగవరపుకోట పందిరప్పన్న కూడలి సమీపంలో గెడ్డను ఆక్రమించి ఓ వ్యక్తి నిర్మాణం చేపట్టేందుకు పూనుకున్నాడు. తన స్థలానికి గెడ్డ ఆనుకుని ఉండడంతో కలిపేసుకున్నాడు. గ్రామ రెవెన్యూ అధికారి దృష్టిలో పడడంతో అడ్డుకున్నారు. కానీ పునాదిని మాత్రం నేటికీ తొలగించలేదు.



శృంగవరపుకోట, జనవరి 27(ఆంధ్రజ్యోతి):

- ఎస్.కోట జగనన్న కాలనీలో ఇంటి స్థలం ఇవ్వలేదన్న అక్కసుతో గత ఏడాది జనవరిలో చెరకు కాటా స్థలానికి ఆనుకుని వున్న గెడ్డను సుమారు పది మంది వరకు ఆక్రమించారు. తాటాకుల(కమ్మలు)తో పాకలు నిర్మించేశారు. దీనిపై చక్కెర కర్మాగారం యాజమాన్యం, రైతులు స్థానిక రెవెన్యూ అధికారులకు ఫిర్యాదు చేశారు. రెవెన్యూ, పోలీస్ అధికారులు పాకలన్నింటినీ తొలగించారు. ఒక పాకను మాత్రం వదిలేశారు. ఇప్పటికీ దానిని తొలగించాలని ఓ వ్యక్తి రెవెన్యూ కార్యాలయం చుట్టూ తిరుగుతున్నాడు.

వైసీపీ పాలనలో ప్రజాప్రతినిధులు, నాయకుల అండతో చెరువులు, గెడ్డలు, పోరంబోకు స్థలాలు, ఇతర ప్రభుత్వ భూములు ఆక్రమణలకు గురయ్యాయి. సాగునీటి, పంచాయతీ, రెవెన్యూ అధికారులు చూసీచూడనట్లు వదిలేశారు. దీంతో విలువైన స్థలాలు పరాధీన పాలయ్యాయి. ఆక్రమించి నిర్మించిన స్థలాలకు పంచాయతీ అనుమతి ఇవ్వకపోయినప్పటికీ పన్నులు వసూలు చేసి చట్టబద్ధత కల్పించేసింది. పంచాయతీ పన్ను రశీదుతో విద్యుత్ సదుపాయాన్ని పొందారు. కొంత మంది ఈ స్థలాల పక్కనున్న జిరాయితీ భూములు సర్వే నెంబర్లతో క్రయ, విక్రయాల జరిపారు. ఇలా సక్రమైన భూమిగా చూపిస్తూ అనుమతులు, బ్యాంకు రుణాల వంటివి పొందినవారున్నారు. అప్పట్లో పత్రికల్లో కథనాలు వచ్చినా పట్టించుకోలేదు.

### ఎస్.కోటలో అక్రమ నిర్మాణాలిలా..

- రాజు చెరువు గర్భంలో 1.79 ఎకరాలు ఆక్రమణకు గురైంది. దీన్ని ఆనుకొని వున్న చింతాడెప్పి నుంచి సీసీ రోడ్డు పొడవునా 44 మంది వరకు పక్కా భవనాలను నిర్మించారు. గాంధీనగర్ ఏడు వీధులూ ఈ చెరువుకు ఆనుకుని ఉన్నాయి.
- పుణ్యగిరి రోడ్డులో జగ్గు చెరువు గట్టు చుట్టూ నిర్మాణాలున్నాయి. ఈ చెరువు దాదాపుగా ఆక్రమణలకు గురైంది.
- పుణ్యగిరి గెడ్డ పూర్తిగా కుచించుకుపోయింది. ఈ గెడ్డకు అటు ఇటూగా ఆక్రమణలు వెలిశాయి. దాదాపు 40 అక్రమ నిర్మాణాలు ఉన్నట్లు రెవెన్యూ అధికారులు గుర్తించారు.
- చెరుకు కాటా, పందిరప్పన్న కూడలి సమీపం, పెదఖండేపల్లి రోడ్డు సమీపంలోని గెడ్డలను చాలా వరకు ఆక్రమించారు.
- పుణ్యగిరి రోడ్డులో జగనన్న లేవుట్ దారికి ఆనుకుని కళాశాల వసతి గృహం వద్ద అక్రమ నిర్మాణం చేపట్టారు.
- విశాఖ-అరకు రోడ్డుకు ఆనుకుని వున్న ప్రైవేటు కళాశాలల వెనకభాగాన 22 (ఎ)లో నమోదై వున్న దాదాపు నాలుగైదు ఎకరాల చెరువు ఆక్రమణల్లో ఉంది. వరి పంట పండిస్తున్నారు.
- ఏటా కనీసం పది మంది గెడ్డలు, చెరువులను ఆక్రమించి నిర్మాణాలను చేపడుతూనే వున్నారు. స్థానికుల నుంచి వ్యతిరేకత, పత్రికల్లో వార్తలు వచ్చినప్పుడు కొంత కాలం అధికారులు అడ్డుకుంటున్నారు. తరువాత వారిచ్చే నజరానాలు, ప్రజాప్రతినిధుల ఒత్తిడికి తలొగ్గుతున్నారు.


గెడ్డ స్థలంలో తొలగించని పూరి పాక

# సంబరంగా తొలేళ్లు



- నేడు పోలమాంబ సిరిమానోత్సవం
- మధ్యాహ్నం 3 గంటలకు ఊరేగింపు ప్రారంభం
- ఏర్పాట్లు పూర్తి చేసిన అధికారులు

6లో

సంబరం మొదలైంది. భక్తజన సందడితో శంబర గ్రామం కళకళలాడుతోంది. అంతటా పోలమాంబ నామస్మరణ మార్మోగుతోంది. అమ్మవారి జాతరలో తొలి అంకమైన తొలేళ్లు ఉత్సవాన్ని సోమవారం రాత్రి సంప్రదాయ బద్ధంగా నిర్వహించారు. భక్తులు ఉపవాస దీక్షలతో పోలమాంబకు ప్రత్యేక పూజలు చేశారు. అమ్మవారికి అక్షింతలు చల్లి... రైతులు ఏరుపూజ చేశారు. ఇక మంగళవారం నిర్వహించనున్న సిరిమానోత్సవానికి అధికారులు అన్ని ఏర్పాట్లు పూర్తి చేశారు. ఈ ఏడాది 36 అడుగుల సిరిమానును సిద్ధం చేశారు. మధ్యాహ్నం 3 గంటలకు సిరిమానోత్సవం ప్రారంభమవుతుంది. ఉత్తరాంధ్ర జిల్లాలతో పాటు తెలంగాణ, ఒడిశా, ఛత్తీస్‌గఢ్ రాష్ట్రాల నుంచి భారీగా భక్తులు తరలిరానున్న దృష్ట్యా ఎవరికీ ఎటువంటి ఇబ్బందులు కలగకుండా అధికారులు చర్యలు చేపట్టారు. వనం, చదురుగుడుల వద్ద ప్రత్యేక క్యూలైన్లు, అంబులెన్స్‌లు, వైద్యశిబిరాలు, అదనపు ఆర్టీసీ బస్సులను సిద్ధం చేశారు. పోలీసులతో పటిష్ఠ భద్రతా ఏర్పాట్లు కూడా చేశారు. మొత్తంగా సిరి సంబరానికి సర్వం సిద్ధమైంది.


సిరిమాను రథం


బారికేడ్లతో క్యూలు



ర్యాలీని ప్రారంభిస్తున్న ఎస్పీ వకుల్‌జిందాల్

## హెల్మెట్‌ను తప్పనిసరిగా ధరించాలి

- అవగాహన ర్యాలీలో ఎస్పీ వకుల్‌జిందాల్

విజయనగరం క్రైం, జనవరి 27(ఆంధ్రజ్యోతి): ద్విచక్ర వాహనదారులు తప్పనిసరిగా హెల్మెట్ ధరించి ప్రాణరక్షణ పొందాలని ఎస్పీ వకుల్‌జిందాల్ సూచించారు. రహదారి భద్రతా మాసోత్సవాల్లో భాగంగా ట్రాఫిక్ పోలీసులు ఆధ్వర్యంలో హెల్మెట్‌ధారణపై నగరంలో సోమవారం అవగాహన ర్యాలీ నిర్వహించారు. ర్యాలీని ఎస్పీ ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఏటా చాలామంది వాహనదారులు రహదారి ప్రమాదాల్లో హెల్మెట్ ధరించని కారణంగా తీవ్ర గాయాలపాలై మరణిస్తున్నారన్నారు. ప్రతి ఒక్కరూ హెల్మెట్ ధరించాలని, లేకుంటే కేసులు నమోదు చేసి అపరాధ రుసుం విధిస్తామన్నారు. కార్యక్రమంలో ఏఎస్పీ నాగేశ్వరరావు, రవాణాశాఖ ఉప కమిషనర్ మణికుమార్, ఎంవీఐలు మురళీకృష్ణ, దుర్గాప్రసాద్, డీఎస్పీలు శ్రీనివాసరావు, యూనివర్స్ తదితరులు పాల్గొన్నారు.

# వేగావతి గతి ఏమవుతుందో?

- అలజంగి వద్ద నదిలో ఇష్టారాజ్యంగా ఇసుక అక్రమ తవ్వకాలు
- ఆందోళన చెందుతున్న నదీ తీర ప్రజలు
- ప్రమాదంలో ఊటబావి



బొబ్బిలి రూరల్, జనవరి 27(ఆంధ్రజ్యోతి): అలజంగి గ్రామ శివారు వేగావతి నదిలో ఇసుక దందా ఆగడం లేదు. ఇష్టారాజ్యంగా తోడుకుపోతున్నారు. నదిని సొంత వనరులా వాడుకుంటున్నారు. వారి తీరుతో నది ప్రవాహం గతి తప్పుతుందని స్థానికులు ఆందోళన చెందుతున్నారు. ఆ గ్రామ పామాయిల్ రైతు గనుల శాఖ అధికారులకు, రెవెన్యూ శాఖ అధికారులకు ఫిర్యాదు చేసినా ఫలితం ఉండడం లేదు. రోజుకు 40 నుంచి 50 ట్రాక్టర్లలో అక్రమంగా తరలిస్తున్నారు. ప్రతిరోజూ వేకువజామున 4 గంటల నుంచే నదిలోకి ట్రాక్టర్లు క్యూ కడుతున్నాయి. అక్రమంగా ఇసుక తవ్వకాలు చేపట్టి ట్రాక్టర్లతో తరలిస్తున్నారు. రెవెన్యూ, పోలీసు అధికారులు కనీసం పట్టించుకోవడం లేదు. దీంతో మరింతగా రెచ్చిపోతున్నారు. ప్రభుత్వ ఇసుక రీచ్ అక్కడ లేకపో యినా అడ్డగోలుగా ఇసుక అక్రమ రవాణాకు పాల్పడు తున్నారు. మూడు మండలా(బాడంగి, దత్తిరేజేరు, బొండపల్లి)ల్లోని సుమారు 68 గ్రామాలకు నీరందించే నదిలోని ఇన్‌ఫిల్టర్ బావులు ప్రమాదంలో పడ్డాయి. ఇసుక మాఫియా కారణంగా తాగునీటి, సాగునీటి వనరులకు పెను ముప్పు పొంచి ఉందని ఆ ప్రాంతీయులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. కనీసం అధికారులు స్పందించి ఊటబావుల వద్దనైనా ఇసుక తవ్వకాలు జరగకుండా చూడాలని కోరుతున్నారు.


ట్రాక్టర్లలో ఇసుక లోడ్ చేస్తున్న దృశ్యం

## 30 వేల ఇళ్లకు పీఎం సూర్యఘర్

- వెండర్లుగా మహిళా సంఘాలు
- కలెక్టర్ బీఆర్ అంబేడ్కర్



విజయనగరం కలెక్టరేట్, జనవరి 27(ఆంధ్రజ్యోతి): మొదటి విడతగా జిల్లాలో సుమారు 30 వేల ఇళ్లకు సూర్యఘర్ పథకం కింద సౌర విద్యుత్ యూనిట్లు ఏర్పాటు చేయనున్నట్లు కలెక్టర్ అంబేడ్కర్ తెలిపారు. ఫిబ్రవరి నుంచి యూనిట్ల ఏర్పాటు ప్రారంభించి మార్చి నాటికి పూర్తి చేయాలని ఆదేశించారు. తన చాంబర్‌లో ఆయా శాఖల అధికారులతో సోమవారం రాత్రి సమావేశం నిర్వహిచారు. జిల్లాలో 24,754 మంది ఎస్సీ లబ్ధిదారులు, 5489 మంది ఎస్టీ లబ్ధిదారులు, 6,897 మంది ఇతర లబ్ధిదారులు ఈ పథకం కింద పేర్లు రిజిస్టర్ చేసుకున్నారని కలెక్టర్ చెప్పారు. మున్సిపాలిటీలకు సంబంధించి విజయనగరం అర్బన్‌లో 2,176 మంది, బొబ్బిలిలో 479 మంది, రాజాంలో 579 మంది, నెల్లిమర్లలో సుమారు 150 మంది ఎస్సీ లబ్ధిదారులను గుర్తించామని చెప్పారు. రిజిస్ట్రేషన్ చేసుకున్న వారంతా ఏయే మహిళా సంఘాల పరిధిలోకి వస్తారో తెలియజేసే సర్వేను త్వరగా పూర్తి చేసి జాబితాలను నెలాఖరులోగా రూపొందించాలని ఆదేశించారు. వీరిలో స్వయం శక్తి సంఘాల సభ్యులకు స్త్రీనిధి ద్వారా, ఇతర సభ్యులకు బ్యాంకుల ద్వారా రుణాలను ఇప్పించి పీఎం సూర్యఘర్ పథకం కింద సోలార్ యూనిట్లను ఏర్పాటు చేయించాలని సూచించారు. ఔత్సాహిక స్వయం శక్తి సంఘాలను సైతం వెండర్లుగా గుర్తించి వారికి ఆదాయాన్ని సమకూర్చాలని సూచించారు. సమావేశంలో ఏపీ ఈపీడీసీఎల్ ఎస్ఈ ఎస్.లక్ష్మణరావు, డీఆర్‌డీఏ పీడీ కళ్యాణ చక్రవర్తి, మెప్మా పీడీ చిట్టిరాజు, ఎల్‌డీఎం వీవీఆర్ మూర్తి తదితరులు ఉన్నారు.

## పోలిపల్లి, కనకమహాలక్ష్మి జాతర్ల తేదీలు ఖరారు

రాజాం పోలిపల్లి పైడితల్లి అమ్మవారి జాతర మార్చి 9 నుంచి 11 వరకూ జరుగనుంది. ఈమేరకు దేవదాయశాఖ అధికారులతో పాటు వంశపారంపర్య ధర్మకర్త, ఎస్వీఆర్ కళాపరిషత్ అధ్యక్షుడు సంయుక్తంగా జాతర తేదీలను సోమవారం ఖరారు చేశారు. మార్చి 11న మంగళవారం రాత్రి ఘటోత్సవంతో జాతర ముగుస్తుంది. అలాగే చీపురుపల్లి కనకమహాలక్ష్మి అమ్మవారి జాతరను మార్చి 2,3,4 తేదీల్లో నిర్వహించేందుకు జాతర నిర్వహణ కమిటీ నిర్ణయించింది. శివరాత్రి అనంతరం వచ్చే తొలి ఆదివారం నుంచి మూడు రోజుల పాటు ఈ జాతర నిర్వహించడం ఆనవాయితీ.

6లో


పోలిపల్లి అమ్మవారు

## విశాఖ డెయిరీ సమావేశం రసాభాస

విశాఖ డెయిరీలో కొన్నిరోజులుగా చోటుచేసుకున్న పరిణామాలు, అవకతవకలపై పాడి రైతులు, ఉద్యోగులు, పాల సేకరణ కేంద్రం అధ్యక్షులు ఒక్కసారిగా ఆగ్రహించారు. రామభద్రపురం మండల కేంద్రంలోని విశాఖ డెయిరీ కార్యాలయంలో సోమవారం జరిగిన సమావేశం రసాభాసగా మారింది. విశాఖ డెయిరీ బోర్డు డైరెక్టర్ పిల్లా రమాకుమారి ఆధ్వర్యంలో జరిగిన ఈ సమావేశంలో ఆమె ప్రసంగిస్తుండగా కొంతమంది పాడిరైతులు, అధ్యక్షులు అడ్డు పడ్డారు. దీంతో ఆమె సభ మధ్యలో ఆవేశంగా వెళ్లిపోయారు.

8లో


బయటకు వచ్చేసిన డైరెక్టర్ రమాకుమారి


పోలమాంబ దర్శనానికి బారులు తీరిన భక్తులు

# జాతరకు వేళాయె

- నేడు శంబర పోలమాంబ సిరిమానోత్సవం
- మధ్యాహ్నం 3 గంటలకు ప్రారంభం
- భారీ బందోబస్తు
- ఘనంగా తొలేళ్లు

సాలూరు రూరల్/మక్కువ/సాలూరు, జనవరి 27(ఆంధ్రజ్యోతి): ఉత్తరాంధ్ర భక్తుల కల్పవల్లి, కోర్కెలు తీర్చే కొంగు బంగారం శంబర పోలమాంబ సిరిమానోత్సవాన్ని మంగళవారం నిర్వహించనున్నారు. ఈ మేరకు దేవదాయ శాఖ, రెవెన్యూ, పోలీసులు ప్రణాళిక సిద్ధం చేశారు. పార్వతీపురం మన్యం జిల్లా అదనపు ఎస్పీ దిలీప్ కిరణ్ సోమవారం భద్రతా ఏర్పాట్లను పరిశీలించారు. భక్తులకు ఇబ్బందులు కలుగకుండా ఏర్పాట్లు చేశామని ఈవో వీవీ సూర్యనారాయణ తెలిపారు.



## భక్తుల కోసం సౌకర్యాలు

భక్తులకు అందించడానికి తాగునీటిని అందుబాటులో ఉంచుతున్నారు. వనంగుడి, చదురు గుడి, రామాలయం, అంగన్‌వాడీ కేంద్రం తదితర ప్రాంతాల్లో ఐదు వైద్య శిబిరాలను ఏర్పాటు చేశారు. మూడు ఫీడర్ అంబులెన్స్‌లు, మూడు 108 వాహనాలను... చదురుగుడి, వనంగుడి వద్ద రెండు అగ్నిమాపక శకటాలను అందుబాటులో ఉంచారు. ఉచిత, రూ.20, రూ.100 దర్శనాలకు వేర్వేరుగా క్యూలైన్లు ఏర్పాట్లు చేస్తున్నారు. దర్శన టిక్కెట్లను ఆన్‌లైన్‌లో జారీ చేస్తున్నారు. ఉచిత ప్రసాద పంపిణీకి ఏర్పాట్లు చేశారు. 40 వేల లడ్డూలు, పులిహోర ప్రసాదం సిద్ధం చేస్తున్నట్టు ఈవో వీవీ సూర్యనారాయణ చెప్పారు. పారిశుధ్య నిర్వహణ పనుల్లో సాలూరు, బొబ్బిలి, పార్వతీపురం మున్సిపాల్టీలు, మేజర్ పంచాయతీల నుంచి 150 మంది సిబ్బందిని వినియోగిస్తున్నారు. గర్భిణులు, వృద్ధులు, దివ్యాంగులకు ప్రత్యేక దర్శన ఏర్పాట్లు చేస్తున్నారు. చిన్నారులకు ఉచితంగా పాలు అందించనున్నారు. కేశఖండనకు, భక్తులు దుస్తులు మార్చుకోవడానికి సౌకర్యాలు కల్పిస్తున్నారు.

## 100 బస్సు సర్వీసులు

సిరిమానోత్సవం సందర్భంగా మంగళవారం శంబరకు 100 బస్సులను నడపనున్నట్టు ఆర్టీసీ సాలూరు డిపో మేనేజర్ భాస్కరరెడ్డి తెలిపారు. ఆర్టీసీ బస్సుల కోసం జడ్పీ ఉన్నత పాఠశాల, వనంగుడి సమీపంలో రెండు తాత్కాలిక బస్‌స్టేషన్లు ఏర్పాటు చేశారు. ప్రైవేటు వాహనాలకు ఐదు పార్కింగ్ స్థలాలు కేటాయించారు.

## భారీ భద్రత

ఈ ఏడాది జాతరకు 689 మంది పోలీసులతో భద్రతా ఏర్పాట్లు చేస్తున్నారు. ఎస్పీ మాధవరెడ్డి ఆధ్వర్యంలో ఆరు డ్రోన్ కెమెరాలతో పర్యవేక్షించనున్నారు. మావోయిస్టుల ప్రభావం ఉండకుండా... సమీప అటవీ ప్రాంతంలో ప్రత్యేక దళాలు కూంబింగ్ చేస్తున్నాయి. వెంగళరాయ సాగర్ ఆనకట్ట సందర్శనకు భక్తులు అధికంగా వచ్చే అవకాశం ఉన్నందున అత్యవసర పరిస్థితుల్లో వినియోగించడానికి బోటును సిద్ధం చేశారు.

## సిరిమాను తిరిగేది ఇలా..

ఈ ఏడాది 36 అడుగుల సిరిమానును సిద్ధం చేశామని ఈవో వీవీ సూర్యనారాయణ చెప్పారు. సిరిమాను పొడవు, సామర్థ్యాన్ని మరోసారి పరిశీలించి...ధ్రువీకరణ పత్రాన్ని మంగళవారం ఉదయం ఇవ్వనున్నట్టు ఆర్ అండ్ బీ జేఈ విజయ కుమార్ చెప్పారు. మధ్యాహ్నం 3 గంటలకు సిరిమానోత్సవం ప్రారంభమవుతుందని ఈవో తెలిపారు. ఈ ఏడాది దీనిని జన్ని పేకాపు రామారావు అధిరోహించనున్నారు. ఆయనను చదురు గుడి నుంచి సాడేపు కుటుంబీకులు భుజాలపై మోసుకొని వచ్చి... సిరిమానును అధిరోహింపజేస్తారు. అప్పటికే ఘటాలు చేరుకుంటాయి. సిరిమాను తొలుత గిరడ వారింటికి, అనంతరం కుప్పిలి, పూడి వారిళ్లకు వెళ్లి పూజలు అందుకుంటుంది. అనంతరం ఘటాలు దక్షిణ దిక్కుగా, సిరిమాను తూర్పు దిక్కుగా వెళతాయి. రెండూ పణుకు వీధిలో కలుస్తాయి. అక్కడ పొడిపిరెడ్డి కుటుంబీకులు, తీళ్ల వారి వారసులుగా అక్యాన కుటుంబీలు ప్రత్యేక పూజలు చేయనున్నారు. అనంతరం సిరిమాను వెనుకకు మళ్లి... గొల్లవీధి, కొత్తవీధి మీదుగా పెద్దమ్మ గుడి వద్దకు చేరుకుంటుంది. అక్కడ భక్తుల నుంచి పూజలు అందుకుంటుంది. అక్కడి నుంచి వెనుదిరిగి నడివీధి కి చేరుకొని ఆగిపోతుంది. అక్కడ సాడేపు కుటుంబీకులు జన్ని పేకాపు రామారావును సిరిమాను నుంచి దించి భుజాలపై చదురుగుడికి తీసుకు వెళతారు.

## ఘనంగా తొలేళ్ల ఉత్సవం

మక్కువ, జనవరి 27(ఆంధ్రజ్యోతి): ఉత్తరాంధ్రుల ఆరాధ్య దేవత శంబర పోలమాంబ అమ్మవారి తొలేళ్ల ఉత్సవం సోమవారం ఘనంగా నిర్వహించారు. ఆదివారం రాత్రి అమ్మవారి ఘటాలు ప్రధాన వీధిలోని గద్దె వద్దకు చేరుకున్నాయి. భక్తుల కోలాహలం, డప్పులు, మంగళ వాయిద్యాల మధ్య మహిషాసురుడు, పోతురాజు వేషధారణలు నిర్వహించారు. శంబరకు చెందిన రైతులు సోమవారం ఉపవాసం ఉండి.. గ్రామ పెద్దలంతా జన్ని వారి ఇంటికి వెళ్లి.. వారిని పిలిచి ఏరోత్సవం నిర్వహించారు. గిరడ, జన్నివారి ఇళ్ల వద్ద నుంచి విత్తనాలను తీసుకొచ్చి అమ్మవారి చెంత పూజలు చేశారు. అమ్మవారికి అక్షింతలు చల్లి... రైతులు ఏరుపూజ చేశారు. గిరడ వారి కుటుంబ సభ్యులు తెచ్చిన విత్తనాలకు అమ్మవారి వద్ద పూజ చేశారు. ఆ తర్వాత రైతులు విత్తనాలను ఇళ్లకు తీసుకొని వెళ్లారు. సాగు సమయంలో పంటకు ఉపయోగించే విత్తనాలతో వీటిని కలిపి పొలంలో చల్లుతారు. దీనితో పంటలు సమృద్ధిగా పండుతాయని రైతుల విశ్వాసం.


అధికారులతో మాట్లాడుతున్న ఎస్పీ మాధవరెడ్డి

## కలెక్టర్, ఎస్పీల పరిశీలన

సిరిమానోత్సవ ఏర్పాట్లను సోమవారం కలెక్టర్ ఎ.శ్యాంప్రసాద్ పరిశీలించారు. భక్తుల దర్శనానికి చేసిన ఏర్పాట్లను ఈవో సూర్యనారాయణ, తదితరులను అడిగి తెలుసుకున్నారు. సతీసమేతంగా అమ్మవారిని దర్శించుకున్నారు. భద్రతా ఏర్పాట్లను సోమవారం సాయంత్రం ఎస్పీ ఎస్వీ మాధవరెడ్డి పరిశీలించారు. సిరిమాను తిరిగే ప్రాంతాన్ని, చదురుగుడి మార్గం తదితర వాటిని పరిశీలించారు. దేవస్థానం, పోలీసు అధికారులతో మాట్లాడి ఏర్పాట్ల వివరాలను తెలుసుకున్నారు. ఆయనతో ఏఎస్పీ అంకిత మహావీర్ సురాన తదితరులు ఉన్నారు.

## ఆరు సెక్టార్లుగా బందోబస్తు

మక్కువ/సాలూరు రూరల్, జనవరి 27 (ఆంధ్రజ్యోతి): శంబర జాతర, సిరిమానోత్సవంలో ఆరు సెక్టార్లుగా, రెండు షిఫ్టుల్లో బందోబస్తు విధులను నిర్వహిస్తున్నామని పార్వతీపురం మన్యం జిల్లా ఏఎస్పీ ఒ.దిలీప్ కిరణ్ తెలిపారు. సోమవారం స్థానిక జడ్పీ పాఠశాలలో పోలీసులకు జాతర విధులను కేటాయించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎవరితోనూ వాదనలకు దిగొద్దన్నారు. ఏదైనా అసౌకర్యం కలిగితే ఇన్‌చార్జిలుగా వ్యవహరించే అధికారుల దృష్టికి తీసుకెళ్లాలని సూచించారు. జాతరలో ఎవరు ఏ తరహా విధులు నిర్వహించాలో స్పష్టం చేశారు. వృద్ధులు, వికలాంగులు, నడవలేని వారికి సేవాదళ్ వాహనంలో దర్శనానికి తీసుకెళ్లాలని సూచించారు. ఈ కార్యక్రమంలో డీఎస్పీలు రాంబాబు, థామస్‌రెడ్డి, సీఐలు బి.అప్పలనాయుడు, పి.రామకృష్ణ, శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.


వివరాలు తెలుసుకుంటున్న కలెక్టర్ శ్యాంప్రసాద్


భక్తుల కోసం ఏర్పాటు చేసిన క్యూలైన్లు


వివిధ జిల్లాల నుంచి వచ్చిన పోలీసు అధికారులు, సిబ్బంది

# మార్చి 9 నుంచి పోలిపల్లి పైడితల్లి ఉత్సవాలు

- 7న అమ్మవారి నేత్రోత్సవం

రాజాం రూరల్, జనవరి 27(ఆంధ్రజ్యోతి): ఉత్తరాంధ్ర జిల్లాల భక్తుల కొంగు బంగారం, కోరిన కోర్కెలు తీర్చే తల్లి రాజాం శ్రీ పోలిపల్లి పైడితల్లి అమ్మవారి 99వ జాతర మహోత్సవాలు మార్చి 9 నుంచి 11 వరకూ నిర్వహించనున్నారు. ఈ మేరకు దేవదాయశాఖ అధికారులతో పాటు వంశపారంపర్య ధర్మకర్త, ఎస్వీఆర్ కళాపరిషత్ అధ్యక్షుడు సలాది తులసీదాస్ సంయుక్తంగా జాతర మహోత్సవాల తేదీలను సోమవారం ఖరారు చేశారు. జాతరకు సంబంధించి దశాబ్దాలుగా వస్తున్న సంప్రదాయం ప్రకారం వంశపారంపర్య ధర్మకర్తలు, అమ్మవారి కుటుంబీకులు పసుపు, కుంకుమలతో పాటు పట్టువస్త్రాలు సమర్పించే నేత్రోత్సవ కార్యక్రమాన్ని మార్చి 7న శుక్రవారం నిర్వహించాలని నిశ్చయించారు. 11న మంగళవారం రాత్రి ఘటోత్సవంతో అమ్మవారి జాతర మహోత్సవాలు ముగుస్తాయి. ఈ ఉత్సవాలను ఏటా దేవదాయ శాఖతో పాటు ఎస్‌వీఆర్ కళాపరిషత్ అధ్యక్షుడు సలాది తులసీదాస్ మాస్టర్, వంశపారంపర్య ధర్మకర్తలు వాచకర్ల కుటుంబీకులు, ఇతరుల సహకారంతో నిర్వహిస్తున్నారు. అమ్మవారి జాతర తేదీలను దేవస్థానం ఈఓ బలివాడ మాధవరావు సోమవారం ధ్రువీకరించారు.


పోలిపల్లి పైడితల్లి అమ్మవారు

## నీటి లభ్యతపై దృష్టి సారించండి

విజయనగరం కలెక్టరేట్, జనవరి 27 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో అమృతధార పథకం కింద గ్రామాలకు తాగునీటి సరఫరా వ్యవస్థ ఏర్పాటుకు ప్రతిపాదనలు రూపొందించేటప్పుడు నీటి లభ్యతను దృష్టిలో ఉంచుకోవాలని కలెక్టర్ అంబేడ్కర్ తెలిపారు. సోమవారం రాత్రి తన ఛాంబర్‌లో అమృతధార పథకంపై సంబంధిత అధికారులతో సమీక్షించారు. కలెక్టర్ మాట్లాడుతూ తారకరామ తీర్థసాగర్ పనులు ప్రస్తుతానికి పూర్తికానందున ప్రత్యామ్నాయాలు ఆలోచించాలన్నారు. ఆర్‌డబ్ల్యూఎస్ ఎస్ఈ కవిత మాట్లాడుతూ మడ్డువలస ప్రాజెక్టు ద్వారా 8 మండలాలు, తాటిపూడి ద్వారా 9, తోటపల్లి ద్వారా 4, ఆంధ్ర రిజర్వాయర్ ద్వారా ఒక మండలానికి, తారకరామ తీర్థ సాగర్ ద్వారా 5 మండలాలకు నీటి సరఫరా చేయనున్నట్టు తెలిపారు. జిల్లాలో మొత్తం 1,621 గ్రామాలకు... 2058 నాటికి పెరిగే జనాభా అవసరాల మేరకు ఇంటింటికీ కొళాయిల ద్వారా తాగునీటి సరఫరాకు అంచనాలు రూపొందించామని చెప్పారు. రూ.3,300 కోట్లతో ప్రతిపాదనలు సిద్ధం చేశామన్నారు.

## మార్చి 2 నుంచి కనక మహాలక్ష్మి జాతర

చీపురుపల్లి, జనవరి 27 (ఆంధ్రజ్యోతి): చీపురుపల్లి పట్టణంలో వెలసిన శ్రీకనక మహలక్ష్మి అమ్మవారి జాతరను మార్చి 2, 3, 4 తేదీల్లో నిర్వహించేందుకు నిర్వహణ కమిటీ నిర్ణయించింది. శివరాత్రి అనంతరం వచ్చే తొలి ఆదివారం నుంచి మూడు రోజుల పాటు ఈ జాతర నిర్వహించడం ఆనవాయితీ. ఈ మేరకు మార్చి 2 నుంచి మూడు రోజుల పాటు జాతర నిర్వహించనున్నారు. ఈ జాతర నిర్వహణ కోసం ఇటీవల కమిటీని నియమించారు. పట్టణ తెలుగుదేశం పార్టీ అధ్యక్షుడు గవిడి నాగరాజు నేతృత్వంలో ఈ కమిటీ ఉత్సవాలకు ఏర్పాట్లు చేస్తోంది.


కనక మహాలక్ష్మి అమ్మవారు

# బొమ్మలు చెబుతాయి పాఠాలు

- అంగన్‌వాడీ కార్యకర్తల సృజన
- వ్యర్థాలతో విభిన్న కళాకృతులు


వ్యర్థాలతో తయారు చేసిన వివిధ రకాల బొమ్మలు


ఆకట్టుకునే బొమ్మలు ఎన్నెన్నో...


దిండులతో ఇలా...

బొబ్బిలి, జనవరి 27(ఆంధ్రజ్యోతి): ఇళ్లలో వినియోగించి.. పడేసిన వ్యర్థాలతో అర్థవంతమైన బొమ్మలు, వస్తువులు తయారు చేసి ప్రశంసలు అందుకుంటున్నారు అంగన్‌వాడీ కార్యకర్తలు, ఆయాలు. బొబ్బిలి పట్టణ ఐసీడీఎస్ పరిధిలో గల స్వామి వారి వీధిలోని అంగన్‌వాడీ కేంద్రంలో ఇలాంటి బొమ్మలు ముచ్చటగొల్పుతాయి. బాలలు ఎక్కువగా కార్టూన్ బొమ్మలకు ఆకర్షితులవుతుంటారు. అలాంటి చిన్నారులను అంగన్‌వాడీ కేంద్రానికి రప్పించాలంటే ఏం చేస్తే బాగుంటుందోనని కార్యకర్తలు రావాడ రమాదేవి, సీహెచ్ వరలక్ష్మిలు ఆలోచించారు. ఆ ఆలోచనలకు పదును పెట్టారు. తమలోని సృజనను వెలికితీశారు. ఇంట్లోని వ్యర్థాలైన సీసాలు, ప్లాస్టిక్ వస్తువులు, కాగితపు గ్లాసులు, దిండ్లు (తలగడలు), చిన్నపాటి డబ్బాలను వినియోగించి వాటితో అనేక రకాల బొమ్మలను తయారు చేశారు. వాటితో అంగన్‌వాడీ కేంద్రంలో ఆకర్షణీయంగా అలంకరించారు. వీరి ప్రయత్నం చిన్నారులను ఆకర్షిస్తుంటే.. ఐసీడీఎస్ ఉన్నతాధికారులు తల్లిదండ్రులను ముచ్చటగొల్పుతోంది.

## విభిన్న రూపాల్లో...

అంగన్‌వాడీ కేంద్రానికి ల్యాండ్ మార్కుగా పసిబిడ్డకు పాలిచ్చే అమ్మ బొమ్మ కనిపిస్తుంది. అలాగే ఐసీడీఎస్ పరిధిలో ఆయా నుంచి ఉన్నతాధికారి ప్రిన్సిపల్ సెక్రటరీ వరకు వివిధ హోదాల్లో ఉండే అందరు అధికారులతో కూడిన ఓ చెట్టును రూపొందించారు. పాత దిండులతో అనేక రకాల బొమ్మలను తయారు చేశారు. ఐసీడీఎస్ ద్వారా అమలవుతున్న ఆరు రకాల సేవలు, పథకాలను వివరిస్తూ తయారు చేసిన బొమ్మలు ఆకట్టుకుంటున్నాయి. ప్లే స్కూలుకు సంబంధించిన బోధనాంశాలతో కూడిన బొమ్మలు, సంపూర్ణ పోషణకు సంబంధించి ఆహార పదార్థాల బొమ్మలు, కిశోర బాలికలు సఖి, సహేలు గ్రూపుల బొమ్మలు కూడా ఆకర్షించేలా ఉన్నాయి. బొమ్మలే కాదు... అంగన్‌వాడీ కేంద్రం ముందు పాత ప్లాస్టిక్ డబ్బాలలో అనేక రకాల మొక్కలనూ పెంచుతున్నారు.


కేంద్రం నిర్వాహకులతో ఐసీడీఎస్ పీఓ విజయలక్ష్మి

### ఈ కేంద్రం ఆదర్శం..

స్వామి వారి వీధి అంగన్‌వాడీ కేంద్రం మిగిలిన వారికి ఆదర్శంగా నిలుస్తోంది. టీచర్లు, ఆయాలు అంకితభావంతో పని చేస్తున్నారు. మా శాఖ ఉన్నతాధికారులు తరచూ ఈ కేంద్రాన్ని సందర్శించడమే కాకుండా.. నిర్వాహకులను అభినందిస్తున్నారు. వీరి స్ఫూర్తితో పనిచేయాలని మిగిలిన వారందరికీ చెబుతుంటారు.

-విజయలక్ష్మి, పీఓ ఐసీడీఎస్ ప్రాజెక్టు, బొబ్బిలి

## నేటి నుంచి ఆధార్ డ్రైవ్

వంగర, జనవరి 27 (ఆంధ్రజ్యోతి): మండలంలోని పలు గ్రామాల్లో మంగళవారం నుంచి మూడు రోజుల పాటు ఆధార్ ప్రత్యేక డ్రైవ్ నిర్వహించనున్నట్లు ఎంపీడీవో త్రినాథరావు ఓ ప్రకటనలో తెలిపారు. వంగర, కింజంగి, అరసాడ, కొప్పరవలస గ్రామాల్లో ఆధార్ ప్రత్యేక డ్రైవ్‌లు నిర్వహిస్తామన్నారు. ఆరేళ్ల లోపు పిల్లలకు కొత్త కార్డులతో పాటు 5 నుంచి 15 ఏళ్ల వారికి బయోమెట్రిక్, ఈకేవైసీ నమోదు చేస్తారన్నారు.

## తూర్పు కాపులకు న్యాయం చేయాలి

రాజాం, జనవరి 27 (ఆంధ్రజ్యోతి): తూర్పు కాపుల సమస్యలను పరిష్కరించి న్యాయం చేయాలని ఎస్పీ వకుల్ జిందాల్‌ను తూర్పుకాపు రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ మక్క సాయిబాబనాయుడు కోరారు. సోమవారం ఎస్పీ కార్యాలయంలో ఆయనను మర్యాదపూర్వకంగా కలిశారు. తూర్పు కాపుల సమస్యలను వివరించారు.

## రామినాయుడుకు ఐకాన్ పురస్కారం

సంతకవిటి, జనవరి 27 (ఆంధ్రజ్యోతి): మండలంలో రంగారాయిపురం గ్రామానికి చెందిన రంగస్థల కళాకారుడు నిలురౌతు రామినాయుడుకు అరుదైన గౌరవం దక్కింది. ఇండియన్ ఐకాన్ పురస్కారానికి ఎంపికయ్యారని తెలుగు వెలుగు సాహితీ వేదిక ఓ ప్రకటనలో తెలిపింది. విజయవాడలోని తుమ్మలపల్లి కళాక్షేత్రంలో ఫిబ్రవరి 2న నిర్వహించే కార్యక్రమంలో ఆయన అవార్డును స్వీకరించనున్నారు.

## కుష్ఠు వ్యాధిపై అవగాహన

విజయనగరం రింగురోడ్డు, జనవరి 27 (ఆంధ్రజ్యోతి): ప్రపంచ కుష్ఠు వ్యాధి దినోత్సవాన్ని పురస్కరించుకుని సోమవారం హీల్ ప్రాజెక్ట్ ఆధ్వర్యంలో చెల్లూరు పంచాయతీలో విద్యార్థులకు వ్యాధిపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ప్రాజెక్ట్ ప్రతినిధి డాక్టరు తాలాడ దీప్తి మాట్లాడుతూ శరీరంపై స్పర్శ లేని మచ్చలు ఉన్నట్టు గుర్తిస్తే ఆసుపత్రికి వెళ్లి వ్యాధి నిర్ధారణ పరీక్షలు చేయించుకోవాలన్నారు. కార్యక్రమంలో ప్రతినిధులు పాల్గొన్నారు.

## సమర్థంగా నిర్వహించండి

జామి, జనవరి 27 (ఆంధ్రజ్యోతి): గ్రంథాలయాలను సమర్థంగా నిర్వహించాలని జిల్లా గ్రంథాలయాల అధికారి బోనీ లక్ష్మి అన్నారు. సోమవారం జామిలోని గ్రంథాలయాన్ని ఆమె ఆకస్మిక తనిఖీ చేశారు. రికార్డులు పరిశీలించారు. లైబ్రేరియన్ సోమునాయుడు ఉన్నారు.

## టెన్త్ విద్యార్థులకు మోడల్ పేపర్లు

గరివిడి, జనవరి 27 (ఆంధ్రజ్యోతి): స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు చెందిన పదోతరగతి తెలుగు మీడియం విద్యార్థులకు యూటీఎఫ్ ప్రతినిధులు సోమవారం మోడల్ పేపర్ల పుస్తకాలను పంపిణీ చేశారు. అంగన్‌వాడీ టీచర్లు, సహాయకులు, ఫెడరేషన్ నాయకులు మల్లపురెడ్డి కృష్ణవేణి రఘుమండ రూప అందజేశారు. కార్యక్రమంలో ఫెడరేషన్ రాష్ట్ర విద్యాసబ్ కమిటీ సభ్యులు డి.రాము, మండల ప్రధాన కార్యదర్శి కె.గోపాలకృష్ణ, సీనియర్ నాయకులు సూరిశ్రీను, ఆడిట్ కమిటీ కన్వీనర్ పిశ్రీను, ఉపాధ్యాయులు చల్లా సింహాచలం, అంగన్‌వాడీ యూనియన్ నాయకులు పాల్గొన్నారు.

## రీసర్వేలో తప్పులు సరిదిద్దండి

వంగర, జనవరి 27 (ఆంధ్రజ్యోతి): మండలంలోని శ్రీహరిపురానికి చెందిన శెట్టి జ్యోతి తనకు చెందిన భూమి మరొకరి పేరిట ఎలా రాశారంటూ తహసీల్దార్‌పై ఆగ్రహం వ్యక్తం చేసింది. సోమవారం మండల రెవెన్యూ కార్యాలయంలో నిర్వహించిన ఫిర్యాదులు విభాగానికి కుటుంబ సభ్యులతో సదరు మహిళ హజరై తహసీల్దార్‌ను నిలదీసింది. శ్రీహరిపురంలో సర్వే నెం. 40/3లో తనకు చెందిన భూమి ఉందని, అది తరతరాలుగా సంక్రమించిందన్నారు. అయితే ఇటీవల నిర్వహించిన సర్వేలో ఉత్తరావల్లి గోపాలనాయుడుకు ఎలా రాశారని ప్రశ్నించింది. దాన్ని సరిచేయాలని కోరింది. లేకుంటే పై అధికారులకు ఫిర్యాదు చేస్తానని తెలిపింది. దాంతో తహసీల్దార్ ధర్మారావు స్పందించారు. సిబ్బందిని పంపి పూర్తిస్థాయిలో విచారణ చేయిస్తానన్నారు.

## ఘనంగా ఎలక్ట్రీషియన్ డే

చీపురుపల్లి, జనవరి 27 (ఆంధ్రజ్యోతి): ప్రపంచ ఎలక్ట్రీషియన్స్ డేను చీపురుపల్లిలో సోమవారం ఘనంగా నిర్వహించారు. చీపురుపల్లి, గరివిడి పట్టణాలకు చెందిన కనకదుర్గ ఎలక్ట్రీషియన్స్ అండ్ ప్లంబర్స్ కార్మిక సంఘం ఆధ్వర్యంలో చీపురుపల్లి మెయిన్‌రోడ్డులో ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో సంఘం అధ్యక్షుడు వై.శ్రీహరి, ప్రతినిధులు పి.మహేష్, ఎ.నాగరాజు, ఆదినారాయణ, గుడ్ల రమేష్, దుర్గారావు తదితరులు పాల్గొన్నారు.

## నాణ్యత లోపం లేకుండా చూడండి

చీపురుపల్లి, జనవరి 27 (ఆంధ్రజ్యోతి): ఉపాధి పనుల్లో నాణ్యతా లోపం లేకుండా చూడాలని టీడీపీ మండల అధ్యక్షుడు రౌతు కామునాయుడు సూచించారు. సోమవారం చీపురుపల్లి పంచాయతీ పరిధిలోని రెడ్డిపేటలో ఉపాధి పనులను ఆయన ప్రారంభించారు. కార్యక్రమంలో రెస్కో మాజీ చైర్మన్ దన్నాన రామచంద్రుడు, గవిడి నాగరాజు, టీడీపీ జిల్లా వాణిజ్య విభాగం ఉపాధ్యక్షుడు రెడ్డి లక్ష్మణరావు, జనసేన ఇన్‌చార్జి విసినిగిరి శ్రీనివాసరావు, కోట్ల కృష్ణ, వెంపడాపు లక్ష్మునాయుడు పాల్గొన్నారు.

## ఉపాధి లక్ష్యంగా ప్రభుత్వ చర్యలు

గజపతినగరం, జనవరి 27 (ఆంధ్రజ్యోతి): ఉద్యోగ, ఉపాధి లక్ష్యంగా ప్రభుత్వం పనిచేస్తోందని టీడీపీ సీనియర్ నాయకుడు కొండపల్లి కొండలరావు అన్నారు. సోమవారం స్థానిక పార్టీ కార్యాలయంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. దావోస్ పర్యటనలో భాగంగా సీఎం చంద్రబాబు, మంత్రి లోకేశ్ పెట్టుబడులే లక్ష్యంగా పలు పరిశ్రమలు రాష్ట్రానికి వచ్చేలా చర్యలు చేపట్టారన్నారు. కార్యక్రమంలో పార్టీ సీనియర్ నాయకులు పి.వి.వి.గోపాలరాజు, జడ్పీటీసీ మాజీ సభ్యుడు మక్కువ శ్రీధర్, బొండపల్లి, కోరాడ కృష్ణ, కొండపల్లి భాస్కరరావు, ప్రదీప్‌కుమార్, రాంజీరాజు ఉన్నారు.

## ఆశ్రమంలో ప్రత్యేక పూజలు

భోగాపురం, జనవరి 27 (ఆంధ్రజ్యోతి): విశాఖ జిల్లా భీమిలి మండలం దాకమర్రి సమీపంలోని తాజుద్దీన్‌బాబా ఆశ్రమంలో ఏపీ మార్క్‌ఫెడ్ చైర్మన్ కర్రోతు బంగార్రాజు సోమవారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. దంగల్ తలపై పెట్టుకుని ఊరేగింపులో పాల్గొన్నారు. ఆయనతో పాటు కుటుంబ సభ్యులు, టీడీపీ కార్యకర్తలు పాల్గొన్నారు.

# రెవెన్యూ సమస్యలపై వినతుల వెల్లువ

- 174 అర్జీలకు గానూ 119 రెవెన్యూ పరిధిలోవే..
- ఫిర్యాదులు స్వీకరించిన కలెక్టర్ అంబేడ్కర్



వినతులు స్వీకరిస్తున్న కలెక్టర్ అంబేడ్కర్

విజయనగరం కలెక్టరేట్, జనవరి 27 (ఆంధ్రజ్యోతి) ప్రజా సమస్యల పరిష్కార వేదికలో రెవెన్యూ సమస్యలపై అర్జీలు వెల్లువెత్తాయి. సోమవారం కలెక్టరేట్ ఆడిటోరియంలో నిర్వహించిన కార్యక్రమంలో మొత్తం 174 వినతులు అందగా, వాటిలో 119 రెవెన్యూ సమస్యలకు సంబంధించినవే. ప్రధానంగా భూములు తమ పేరున మార్పు చేయాలని, భూ ఆక్రమణలు అరికట్టాలని, రీసర్వేలో వచ్చిన సమస్యలు పరిష్కరించాలంటూ అర్జీదారులు ఫిర్యాదులు అందజేశారు. కలెక్టర్ అంబేడ్కర్, జేసీ సేతు మాధవన్, డీఆర్వో శ్రీనివాసమూర్తి వినతులను స్వీకరించారు. ఈ సందర్భంగా కలెక్టర్ అంబేడ్కర్ మాట్లాడుతూ రీ ఓపెన్ కేసులపై పూర్తిగా విచారణ చేపట్టాలన్నారు. ● ఈ సందర్భంగా ఎల్.కోటకు చెందిన దిలీప్.. తన గోడు వెళ్లబోసుకున్నాడు. తాను నడవలేని, కదలేని స్థితిలో ఉన్నానని, మరొకరిపై ఆధారపడి జీవించాల్సి వస్తోందన్నారు. ప్రభుత్వం అందిస్తున్న రూ.6 వేలు పింఛన్ చాలడం లేదని విన్నవించుకున్నారు. అధికారులు స్పందించి పింఛన్ డబ్బు పెంచి ఆదుకోవాలని కలెక్టర్‌కు వినతిపత్రం అందజేశారు. ● వేపాడ మండలం బానాది పంచాయతీ కార్యదర్శి ప్రభుత్వ నిబంధనలకు విరుద్ధంగా పనిచేస్తున్నారని సర్పంచ్ యశోద, వైస్ సర్పంచ్ కె.కృష్ణ తదితరులు మాజీ ఎమ్మెల్యే కడుబండి శ్రీనివాస్‌తో కలిసి కలెక్టర్‌కు వినతిపత్రం అందజేశారు. అనంతరం రిపబ్లిక్ డే సందర్భంగా పోలీసు పెరేడ్‌లో ఏర్పాటు చేసిన స్టాల్స్‌కు పీజీఆర్ఎస్ అనంతరం కలెక్టర్ ప్రశంసాపత్రాలు పంపిణీ చేశారు.

## దావోస్ పర్యటనతో రాష్ట్రానికి మేలు



కేక్ కట్ చేస్తున్న ఎమ్మెల్యే అతిది

విజయనగరం రూరల్, జనవరి 27 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రాన్ని స్వర్ణాంధ్రప్రదేశ్‌గా మార్చే లక్ష్యంతో ముఖ్యమంత్రి చంద్రబాబు, యువనేత లోకేశ్ కృషి చేస్తున్నారని ఎమ్మెల్యే అదితి గజపతిరాజు అన్నారు. చంద్రబాబు, లోకేశ్ తాజాగా దావోస్‌లో పర్యటన ఫలితంగా రాష్ట్రానికి మరిన్ని పెట్టుబడులు రానున్నాయన్నారు. సోమవారం పార్టీ కార్యాలయంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఎమ్మెల్యే మాట్లాడారు. దావోస్ పర్యటనలో చంద్రబాబు, లోకేశ్‌తో పాటు రాష్ట్ర బృందం పలు దిగ్గజ కంపెనీలతో చర్చలు జరిపాయన్నారు. రాష్ట్రంలో పెట్టుబడులు పెట్టేందుకు వారిలో చాలామంది ఉత్సాహం చూపిస్తున్నారన్న విషయం తెలుస్తోందన్నారు. వైసీపీ దుర్మార్గపు పాలన చూసి వెనక్కిపోయిన పారిశ్రామికవేత్తలంతా రాష్ట్రంలో సుస్థిర పాలన చూసి మళ్లీ తిరిగి రావడం ఎంతో సంతోషాన్నిస్తోందన్నారు. యువనేత నారా లోకేశ్ యువగళం పేరిట రాష్ట్రంలో నిర్వహించిన పాతయాత్ర రెండేళ్లు పూర్తి చేసుకున్న నేపథ్యంలో ఆమె కేక్‌ను కట్ చేశారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు ఐవీపీ రాజు, విజ్జపు ప్రసాద్, కనకల మురళీమోహన్, బొద్దల నర్సింగరావు, కర్రోతు నర్సింగరావు, కంది మురళీనాయుడు, నడిపిల్లి రవికుమార్, అనురాధ బేగం, అవనాపు విజయ్ తదితరులు పాల్గొన్నారు.

## పారిశ్రామిక రంగానికి నూతన వెలుగులు



మాట్లాడుతున్న ఎమ్మెల్యే కోండ్రు

రాజాం, జనవరి 27 (ఆంధ్రజ్యోతి): ముఖ్యమంత్రి చంద్రబాబు పాలనలో రాష్ట్రంలో పెట్టుబడులు పెట్టేందుకు పరిశ్రమలు స్థాపించేందుకు ఆంధ్రప్రదేశ్ స్వర్ణధామిగా మారిందని ఎమ్మెల్యే కోండ్రు మురళీమోహన్ అన్నారు. సోమవారం పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. సీఎం దావోస్ పర్యటన విజయవంతం అయిందన్నారు. వరల్డ్ ఎకనామిక్ ఫారం సదస్సులో ప్రత్యేక ఆకర్షణగా ఆంధ్రప్రదేశ్ నిలిచిందన్నారు. జగన్‌రెడ్డి నిర్వాకానికి అంధకారంలోకి వెళ్లిన పారిశ్రామిక రంగానికి నూతన వెలుగులు తీసుకురావడం కోసం తండ్రి కొడుకులు రేయింబవళ్లు కష్టపడుతున్నారన్నారు. లోకేశ్.. యువగళం పాదయాత్ర ద్వారా ప్రజానేతగా ఎదిగారని, తాను ఎదగడమే కాదు పార్టీ విజయానికి కీలకపాత్ర పోషించారన్నారు. కార్యక్రమంలో బీసీ సెల్ జిల్లా అధ్యక్షుడు గురవాన నారాయణరావు. మండల సర్పంచ్‌ల సంఘం అధ్యక్షుడు వంగా వెంకటరావు తదితరులు పాల్గొన్నారు.

## యువగళంతోనే కూటమి విజయం



రవిశేఖర్‌కు కేక్ తినిపిస్తున్న బంగార్రాజు

నెల్లిమర్ల, జనవరి 27 (ఆంధ్రజ్యోతి): టీడీపీ జాతీయ ప్రధాన కార్యదర్శి, రాష్ట్ర మంత్రి లోకేశ్ 2023లో చేపట్టిన యువగళం పాదయాత్ర రాష్ట్రంలో కూటమి విజయానికి బీజం వేసిందని ఏపీ మార్క్‌ఫెడ్ చైర్మన్, నెల్లిమర్ల నియోజకవర్గ టీడీపీ ఇన్‌చార్జి కర్రోతు బంగార్రాజు అన్నారు. యువగళం పాదయాత్రకు రెండేళ్లు పూర్తయిన సందర్భాన్ని పురస్కరించుకుని నెల్లిమర్లలోని టీడీపీ కార్యాలయంలో సోమవారం బంగార్రాజు, టీడీపీ మండల అధ్యక్షుడు కడగల ఆనంద్‌కుమార్ ఆధ్వర్యంలో వేడుకలు నిర్వహించారు. ఈ సందర్భంగా భారీ కేక్‌ను కట్‌చేసి సంబరాలు చేసుకున్నారు. ఈసందర్భంగా బంగార్రాజు మాట్లాడుతూ వైసీపీ అకృత్య పాలనతో విసిగి వేసారిన రాష్ట్ర ప్రజానీకానికి లోకేశ్ చేపట్టిన యువగళం పాదయాత్ర భరోసా తెప్పించిందన్నారు. కార్యక్రమంలో టీడీపీ సీనియర్ నాయకుడు, విశాఖ ఉత్తర నియోజకవర్గ పరిశీలకుడు సువ్వాడ రవిశేఖర్, జిల్లా అధికార ప్రతినిధి గేదెల రాజారావు, జిల్లా కార్యదర్శి లెంక అప్పలనాయుడు, పార్టీ నాయకులు అవనాపు సత్యనారాయణ, రెడ్డి వేణు, బొంతు వెంకటరమణ, గురాన చక్రధర్, బయిరెడ్డి కళ్యాణ్ చక్రవర్తి పాల్గొన్నారు.

## కాలేజీ ఏర్పాటుకు స్థల పరిశీలన

రాజాం, జనవరి 27 (ఆంధ్రజ్యోతి): రాజాం పట్టణంలో ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాల ఏర్పాటుకు ఎమ్మెల్యే కోండ్రు మురళీమోహన్ సోమవారం స్థల పరిశీలన చేశారు. బొబ్బిలి రోడ్డులో గతంలో నిర్వహించిన పాత ఐటీఐ భవనాన్ని పరిశీలించారు. ప్రస్తుతం పాత ఐటీఐ భవనం అనుకూలంగా ఉంటుందని ఈ విషయం ప్రభుత్వానికి నివేదిస్తామన్నారు. భవనం యజమాని కొత్తా సాయిప్రశాంత్‌కుమార్‌తో మాట్లాడారు. గతంలో ఎంత అద్దె చెల్లించేవారని, ప్రస్తుతం ఎంత అద్దెను ఆశిస్తున్నారని అడిగి తెలుసుకున్నారు. నూతన భవనం ఏర్పాటు చేసేనంతవరకు ఈ భవనం అనుకూలంగా ఉంటుందన్నారు. అనంతరం ఆర్అండ్‌బీ గెస్ట్‌హౌస్ భవనాన్ని పరిశీలించారు. పనులు వేగవంతం చేయాలని ఆదేశించారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు వంగా వెంకటరావు, గురవాన నారాయణరావు, దుప్పలపూడి శ్రీనివాసరావు, నంది సూర్యప్రకాశరావు, శాసపు రమేష్‌కుమార్, టంకాల కన్నంనాయుడు, జొన్నాడ రంజిత్, జరజాన నీలయ్య, పెంకి చైతన్యకుమార్, టంకాల నాగరాజు, మద్దు హరి, వల్లూరు గణేష్, గణపతినాయుడు తదితరులు పాల్గొన్నారు.

## బాధితుల సమస్యలను పరిష్కరించండి

- ఎస్పీ వకుల్ జిందాల్



వివరాలు అడిగి తెలుసుకుంటున్న ఎస్పీ

విజయనగరం క్రైం, జనవరి 27 (ఆంధ్రజ్యోతి): జిల్లాలోని వివిధ పోలీసు స్టేషన్‌ల పరిధిలో బాధితుల సమస్యలను తక్షణమే చట్ట పరిధిలో పరిష్కరించాలని ఎస్పీ వకుల్ జిందాల్ పోలీసు అధికారులను ఆదేశించారు. సోమవారం జిల్లా పోలీసు కార్యాలయంలోని సమావేశ మందిరంలో ప్రజా సమస్యల పరిష్కార వేదికలో 34 ఫిర్యాదులు స్వీకరించారు. బాధితుల ఫిర్యాదులను సంబంధిత పోలీసు అధికారులతో మాట్లాడి చర్యలకు ఆదేశించారు. ఫిర్యాదుల పూర్వపరాలను విచారణ చేసి, చట్ట పరిధిలో చర్యలు తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో డీఎస్పీ ఎం.శ్రీనివాసరావు, సీఐలు లీలారావు, ఆర్‌వీఆర్‌కె చౌదరి, ఎస్ఐ రాజేష్, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## రోడ్డు పనుల అడ్డగింత



పనులు అడ్డుకుంటున్న రైతులు

శృంగవరపుకోట రూరల్, జనవరి 27 (ఆంధ్రజ్యోతి): కొట్టాం రెవెన్యూ పరిధిలో దళితులు సాగు చేస్తున్న భూముల్లో నుంచి కొంతమంది వ్యక్తులు రోడ్డు ఏర్పాటుకు యత్నించడంతో సోమవారం వారు అడ్డుకున్నారు. ఈ విషయంపై సాగుదారులు తెరపల్లి పైడిరాజు, కొల్లి రాజమ్మ, బొడు వెంకటరావు, సత్తిబాబు, అప్పలనాయుడు, సన్నిబాబు తదితరులు మాట్లాడుతూ కొట్టాం పరిధిలోని సర్వే నెంబరు 464లో కొండ పోరంబోకును గడిచిన 40 ఏళ్లుగా సాగుచేస్తున్నామన్నారు. గతంలో ఇక్కడ క్వారీలు కొనసాగేవని, కొండపై పురాతన విష్ణు ఆలయం దెబ్బతింటుందని అప్పటి కలెక్టర్ వీరబ్రహ్మయ్యకు ఫిర్యాదు చేయడంతో క్వారీలు ఆగిపోయాయన్నారు. తాజాగా అదే కొండను కొందరు సుమారు 9.4 హెక్టార్లలో లీజుకు తీసుకున్నారన్నారు. అయితే వారు తమ వాహనాలను నిలుపుకునేందుకు తాము సాగుచేస్తున్న భూములపై కన్ను వేశారన్నారు. కనీసం సమాచారం ఇవ్వకుండా తాము పెంచుతున్న చెట్లు తొలగించేందుకు యంత్రాలతో వచ్చారన్నారు. దీంతో తాము అడ్డుకున్నామన్నారు. ఈ కొండ పోరంబోకు వద్ద రోడ్డు ఏర్పాటు విషయంపై రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ మనోజ్ వివరణ కోరగా ఈ విషయంపై వీఆర్‌వోను పంపించామని, ఈ పనులు చేస్తున్న వారి నుంచి భూమి ఆధారాలు సేకరించాలని ఆదేశించామన్నారు.

## కళాశాల అభివృద్ధికి సహకరించండి



ఎమ్మెల్యేను కలిసిన ప్రిన్సిపాల్, సిబ్బంది

చీపురుపల్లి, జనవరి 27 (ఆంధ్రజ్యోతి): చీపురుపల్లి ప్రభుత్వ జూనియర్ కళాశాలను అభివృద్ధి చేయడానికి సహకారం అందించాలని ప్రిన్సిపాల్ మద్దిలి వినోద్‌బాబు, సిబ్బంది ఎమ్మెల్యే కిమిడి కళావెంకటరావుకు విజ్ఞప్తి చేశారు. సోమవారం రాజాంలోని నివాసంలో ఎమ్మెల్యేను వారు కలిశారు. కళాశాల భవనానికి వైట్‌వాష్ వేయించాలన్నారు. చిన్నపాటి మరమ్మతులు పూర్తి చేయాల్సి ఉందన్నారు. విద్యార్థుల కోసం తాగునీటి సౌకర్యం కల్పించినందుకు వారు ఎమ్మెల్యేకు ధన్యవాదాలు తెలిపారు.

## వసతి గృహాల అభివృద్ధికి చర్యలు తీసుకుంటాం

భోగాపురం, జనవరి 27 (ఆంధ్రజ్యోతి): వసతిగృహాల అభివృద్ధికి చర్యలు చేపడతామని ఎంపీపీ ఉప్పాడ అనూషా అన్నారు. సోమవారం భోగాపురంలో నిరుపయోగంగా ఉన్న ఎస్సీ, బీసీ వసతిగృహాలను ఆమె పరిశీలించారు. బీసీ వసతి గృహంలో కొన్ని గదుల మరమ్మతులకు అంచనాలు తయారు చేయాలని మండల ఇంజినీరింగ్ అధికారి జి.శ్రీనును ఆదేశించారు. కార్యక్రమంలో ఎంపీడీవో కె.గాయత్రి, సూర్యనారాయణరెడ్డి ఉన్నారు.

## అధికారులకు సత్కారం



తహసీల్దార్‌ను సత్కరిస్తున్న దృశ్యం

రాజాం, జనవరి 27 (ఆంధ్రజ్యోతి): ఉత్తమ సేవా పురస్కారాలను అందుకున్న తహసీల్దార్ ఎస్.కృష్ణంరాజు, మున్సిపల్ కమిషనర్ జె.రామప్పల నాయుడు, ఏఈ పొన్నాడ వెంకటరామరాజులను రాజాం రెడ్‌క్రాస్ ప్రతినిధులు కొత్తా సాయిప్రశాంత్ కుమార్. పెంకి చైతన్యకుమార్ తదితరులు సోమ వారం సత్కరించారు.

## నేడు త్యాగరాజ ఆరాధనోత్సవం

రాజాం, జనవరి 27 (ఆంధ్రజ్యోతి): స్థానిక టీటీడీ కల్యాణమండపంలో సద్గురు త్యాగరాజస్వామి ఆరాధనోత్సవాలను మంగళవారం నిర్వహిస్తున్నట్టు నాయీ బ్రాహ్మణ సేవాసంఘం అధ్యక్షుడు పి.వెంకటరమణ తెలిపారు. సోమవారం రాజాం రెడ్‌క్రాస్ ఆధ్వర్యంలో కరపత్రాన్ని ఆవిష్కరించారు.

## ఆతవ రోడ్డు పనులు పూర్తి చేయండి



రోడ్డు పనులు పూర్తి చేయాలని నినాదాలు చేస్తున్న గ్రామస్థులు

వేపాడ, జనవరి 27 (ఆంధ్రజ్యోతి): మండలంలోని ఆతవ రోడ్డు పనులు పూర్తి చేయాలని సోమవారం గ్రామస్థులు డిమాండ్ చేశారు. ఆకుల సీతంపేట సమీపంలోని ఆతవ రహదారి ప్రారంభంలో సోమవారం ధర్నా చేపట్టారు. ఓట్ల కోసం రహదారి అభివృద్ధి చేస్తామంటూ హమీలు ఇచ్చిన నేతలు గెలుపొందిన అనంతరం మాట దాటవేస్తున్నారని వారు మండిపడ్డారు. ఇప్పటికైనా రహదారి పనులు పూర్తిచేయాలని దళిత నాయకులు ఆతవ ఉదయభాస్కర్, కెర్రి దేముడు తదితరులు డిమాండ్ చేశారు. కార్యక్రమంలో గొల్ల ఈశ్వరరావు, గ్రామ పెద్దలు, ప్రజలు పాల్గొన్నారు. విషయం తెలుసుకున్న వేపాడ ఎంపీడీవో సూర్యనారాయణ, పీఆర్ ప్రత్యేక విభాగం డీఈఈ జీఎస్ఎన్ మూర్తి, ఏఈ మానస.. ఆందోళనకారులతో సమావేశమయ్యారు. వారం రోజుల్లో పనులు ప్రారంభించే చర్యలు తీసుకుంటామని హమీ ఇచ్చారు.

## శిశువు మృతిపై డీఐవో విచారణ

శృంగవరపుకోట రూరల్, జనవరి 27 (ఆంధ్రజ్యోతి): మండలంలోని దారపర్తి పంచాయతీ చిలకపాడు గ్రామానికి చెందిన రెండు నెలల బాలుడు రెండు రోజుల క్రితం అనారోగ్యంతో మృతి చెందడానికి వైద్యుల నిర్లక్ష్యమే కారణమని పత్రికల్లో వార్తలు రావడంతో డీఎంహెచ్‌వో స్పందించారు. ఆ ఘటనపై విచారణ చేయాలని డీఐవో అచ్యుతకుమారిని ఆదేశించారు. దాంతో ఆమె సోమవారం చిలకపాడుకు వెళ్లి మృతి చెందిన శిశువు తల్లిదండ్రులతో మాటాడారు. ఈవిషయంపై డీఐవోను వివరణ కోరగా డీఎంహెచ్‌వో ఆదేశాల మేరకు తాము వచ్చానని, నివేదికను డీఎంహెచ్‌వోకు అందజేస్తానన్నారు. ఈ సందర్భంగా డీఐవోతో గిరిజన యువత మాట్లాడారు. ఇక్కడ విధులు నిర్వహించే వారు విశాఖపట్నం, విజయనగరం నుంచి వచ్చి వెళ్తున్నారన్నారు. స్థానికంగా ఉండే వారిని నియమించాలని కోరారు. డీఐవో పర్యటనలో హెచ్‌ఈఈ రత్నకుమారి, ఏఎస్‌వో మురళీ తదితరులున్నారు.

## కుమారుడిని అప్పగించాలని ఆందోళన

విజయనగరం క్రైం, జనవరి 27 (ఆంధ్రజ్యోతి): నెల్లిమర్ల మండలం కొండవెలగాడలోని ప్రైవేటు కళాశాలలో ఇంటర్ చదువుతున్న కుమారుడు సంక్రాంతి పండుగ సెలవులు నిమిత్తం ఇంటికి వచ్చి తిరిగి 20న కళాశాల వసతి గృహం వెళ్లాడని, అయితే కళాశాల యాజమాన్యం 24న తమ కుమారుడు రాలేదని కళాశాల నుంచి ఫోన్ తండ్రి డి.అప్పలనాయుడు ఆందోళన వెలిబుచ్చారు. కళాశాల యాజమాన్యంపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. రింగురోడ్డు సమీపంలోని కళాశాలకు చెందిన ప్రధాన కార్యాలయం ఎదుట సోమవారం ఆందోళనకు చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ. మా కుమారుడు కళాశాల నుంచి బయటకు వెళ్లి రెండు రోజులు గడుస్తున్నా, పట్టించుకోకుండా నిర్లక్ష్యం వహించారన్నారు. యాజమాన్యం 24 న తమకు సమా చారం అందించాలని కళాశాలకు వెళ్లి విచారించగా 23వ తేదీ ఉదయమే తన కుమారుడు బయటకు వెళ్లారని ఈ విషయాన్ని యాజమాన్యం తమకు ఎందుకు తెలియజేయలేదని నిలదీశారు. కుమారుడిని అప్పగించాలని డిమాండ్ చేశారు

## విద్యార్థి అదృశ్యంపై కేసు నమోదు

నెల్లిమర్ల, జనవరి 27 (ఆంధ్రజ్యోతి): మండలంలోని కొండవెలగాడలోని ఓ ప్రైవేటు కళాశాలలో ఇంటర్ చదువుతున్న దత్తిరాజేరు మండలం వంగర గ్రామానికి చెందిన దత్తి చైతన్య (17) అదృశ్యమైనట్లు కుటుంసభ్యులు సోమవారం నెల్లిమర్ల పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈ నెల 23న కళాశాల నుంచి బయటకు వెళ్లిన చైతన్య ఇంతవరకు ఇంటికి గానీ, కళాశాలకు గాని చేరలేదని ఆ ఫిర్యాదులో పేర్కొన్నారు. ఆచూకీ తెలిసిన వారు నెల్లిమర్ల ఎస్ఐ 9121109444 కు సమాచారం అందించాలని సూచించారు.

## అదృశ్యమైన బాలిక గుర్తింపు

కొత్తవలస, జనవరి 27 (ఆంధ్రజ్యోతి) : అదృశ్యమైన బాలికను కొద్ది గంటలలోనే పట్టుకుని తల్లిదండ్రులకు అప్పగించినట్టు సీఐ షణ్ముఖరావు తెలిపారు. ఇందుకు సంబంధించిన వివరాలు ఇలా ఉన్నాయి. మండలంలోని మంగళపాలెం గ్రామానికి చెందిన వెలమ చరిష్మా(11) లక్కవపుకోటలోని మోడల్ స్కూల్‌లో 5వతరగతి చదువుతోంది. ఆదివారం స్కూల్‌లో నిర్వహించిన గణతంత్ర వేడుకలకు హాజరై అనంతరం తన స్నేహితురాళ్లతో కలిసి జమ్మాదేవిపేటలోని వారింటికి వెళ్లింది. సాయంత్రం అక్కడ నుంచి ఆర్టీసీ బస్సులో బయలుదేరి మంగళపాలెం బస్టాప్ వద్దకు వచ్చి తండ్రితో ఫోన్‌లో మాట్లాడి స్కూల్ నుంచి వచ్చేసినట్టు తెలిపింది. ఇంటికి వెళ్లిపోతున్నానని చెప్పింది. ఆమె సాయంత్రం వరకు ఇంటికి చేరక పోవడంతో ఆందోళనతో పోలీసులకు ఫిర్యాదు చేశారు. దీంతో సీఐ అదృశ్యమైన బాలిక ఫొటోలను విశాఖ సీటీ పోలీసులకు పంపించి బాలికను గాలించే ప్రయత్నం చేశారు. ఎస్ఐ సుదర్శనరావుతో ఒకటీంను ఏర్పాటు చేశారు. అదృశ్యమైన బాలిక స్నేహితులు, సీసీ కెమెరా పుటేజీలను పరిశీలన చేసి బాలిక కదలికలను ట్రాక్ చేయగా పెందుర్తి వైపు వెళ్లినట్టు గమనించి పెందుర్తి పరిసర ప్రాంతాలను గాలించారు. చివరకు పెందుర్తి బస్టాఫ్ వద్ద ఉన్నట్టు గుర్తించి పట్టుకుని తీసుకొచ్చి బాలిక తల్లిదండ్రులకు అప్పగించారు. ఇదంతా గంటల వ్యవధిలోనే జరిగిందని సీఐ తెలిపారు.

## చోరీ కేసులో వ్యక్తి అరెస్టు

విజయనగరం క్రైం, జనవరి 27 (ఆంధ్రజ్యోతి): విజయనగరం రూరల్ పోలీస్ స్టేషన్ పరిధిలోని చెల్లూరు గ్రామంలో గల ఏటీఎం కేంద్రంలో బ్యాటరీ దొంగతనం కేసులో ఓ వ్యక్తిని అరెస్టు చేసి ఆరు బ్యాటరీలను స్వాధీనం చేసుకున్నామని ఎస్ఐ అశోక్‌కుమార్ తెలిపారు. ఏటీఎం నిర్వాహకులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు దర్యాప్తు చేపట్టామన్నారు. ఈనెల 26న చెల్లూరు హైవేపై అనుమానాస్పదంగా బ్యాటరీలతో ఉన్న విజయనగరం మండలం గుంకలాం గ్రామానికి చెందిన లెంకా సత్తిబాబు అదుపులోకి తీసుకుని విచారించగా నేరం అంగీకరించాడని ఎస్ఐ తెలిపారు. దాంతో అతడిని అరెస్టు చేశామన్నారు.

## మద్యం విక్రయిస్తున్న వ్యక్తుల అరెస్టు

విజయనగరం క్రైం, జనవరి 27 (ఆంధ్రజ్యోతి): జిల్లాలోని డెంకాడ మండలం చింతలవలసలో అక్రమంగా మద్యం విక్రయిస్తున్న ఇద్దరు వ్యక్తులను అరెస్టు చేసి వారి నుంచి 47 మద్యం సీసాలు స్వాధీనం చేసుకున్నట్టు ఎన్‌ఫోర్స్‌మెంట్ ఎస్ఐ రాజశ్రీ సోమవారం తెలిపారు. గ్రామానికి చెందిన కె.అబద్దం 25 మద్యం సీసాలు, పాపాయమ్మ నుంచి 22 మద్యం సీసాలు స్వాధీనం చేసుకుని తదుపరి చర్యలు నిమిత్తం ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ విజయనగరం సర్కిల్-2 అప్పగించినట్టు తెలిపారు. దాడుల్లో హెచ్‌సీ నాగేశ్వరరావు, సుదర్శన్, ఈసీలు నాయుడు, మనోజ్ తదితరులు పాల్గొన్నారన్నారు. ● అలాగే ముసిరి గ్రామంలో అక్రమంగా సారా విక్రయిస్తున్న గండిమల పైడిరాజును అరెస్టు చేసి ఐదు లీటర్ల సారా స్వాధీనం చేసుకున్నట్టు ఎన్‌ఫోర్స్‌మెంట్ సీఐ ఇందిరాదేవి తెలిపారు. దాడుల్లో ఎస్ఐ రాజశ్రీ, హెచ్‌సీ నాగేశ్వరరావు, ఈసీలు నాయుడు, ధనలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

## మద్యం సీసాలతో మరో ఇద్దరు..

కొత్తవలస, జనవరి 27 (ఆంధ్రజ్యోతి) : రెండు వేర్వేరు ఘటనల్లో ఇద్దరు వ్యక్తులను సోమవారం అరెస్టు చేసినట్టు ఎక్సైజ్ సీఐ జీఎస్ రాజశేఖరనాయుడు తెలిపారు. కొత్తవలస పంచాయతీ బలిఘట్టాం సమీపంలో 10 బీరు సీసాలతో ఉన్నజి కన్నారావును పట్టుకుని అరెస్టు చేశామన్నారు. అలాగే విజయనగరానికి చెందిన ఎన్‌ఫోర్స్‌మెంట్ సిబ్బందితో కలసి మండలంలోని ముసిరాంలో 5 లీటర్ల సారాతో జి.పైడిరాజును అరెస్టు చేశామన్నారు. దాడుల్లో ఎన్‌ఫోర్స్‌మెంట్ సీఐ ఇందిరాదేవి, సబ్ ఇన్‌స్పెక్టర్లు రమ్యశ్రీ, వీఎన్‌రాజు, హెచ్‌సీ బి.రాముడు, ప్రసాద్, ఆదినారా యణ, జి.రమేష్, పుష్పలత పాల్గొన్నారన్నారు.

## అదృశ్యమైన మహిళ మృతి

వేపాడ, జనవరి 27 (ఆంధ్రజ్యోతి): మండలంలోని బొద్దాం గ్రామానికి చెందిన వాణి బావిలో పడి మృతి చెందిందని వల్లంపూడి ఎస్ఐ బొడ్డు దేవి తెలిపారు. వాణి అదృశ్యమైందని ఆమె తండ్రి సూర్యనారాయణ సోమవారం ఇచ్చిన ఫిర్యాదుపై కేసు నమోదు చేశామన్నారు. ఆమె బావిలో పడి మృతి చెందినట్టు గుర్తించి మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ఆస్పత్రికి తరలించామన్నారు.

## ఐఆర్ ప్రకటించండి

విజయనగరం రూరల్, జనవరి 27 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వం ఉద్యోగ, ఉపాధ్యాయులకు 12వ పీఆర్‌సీని తక్షణమే వేసి 30 శాతం ఐఆర్‌ని ప్రకటించాలని ఎస్టీయూ ఉపాధ్యాయ సంఘం జిల్లా అధ్యక్షుడు కె.జోగారావు, ప్రధాన కార్య టదర్శి చిప్పాడ సూరిబాబు డిమాండ్ చేశారు. సోమవారం అంబేడ్కర్ భవనంలో ఏర్పాటు చేసిన జిల్లా కార్యవర్గ సమావేశంలో స్వామి, బంగారయ్య, మురళీ, అర్జునుడు, రమణ, నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

## గుండెపోటుతో కళా సోదరుడి మృతి



సత్యనారాయణ(ఫైల్)

రేగిడి, జనవరి 27 (ఆంధ్రజ్యోతి): చీపురుపల్లి ఎమ్మెల్యే, మాజీ మంత్రి కిమిడి కళావెంకటరావు సోదరుడు కిమిడి సత్యనారాయణ(78) సోమవారం రాత్రి మృతి చెందారు. ఆదివారం రాత్రి ఆయన గుండెపోటుకు గురికావటంతో కుటుంబ సభ్యులు విశాఖలోని ఆస్పత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ సోమవారం రాత్రి మృతి చెందారు. సత్యనారాయణ తొలితరం పారిశ్రామిక వేత్తగా గుర్తింపు పొందారు. కళాకు ఏడుగురు సోదరు ల్లో ఈయన ఐదోవాడు. ప్రస్తుతం రేగిడి నీటి సంఘం అధ్యక్షుడిగా కొనసాగుతున్నారు. సత్యనారాయణకు భార్య సత్య వతి, నలుగురు పిల్లలున్నారు.

## టంకాల కుటుంబానికి పరామర్శ

రేగిడి, జనవరి 27 (ఆంధ్రజ్యోతి): టీడీపీ సీనియర్ నేత, కో-ఆపరేటివ్ సెక్రటరీ టంకాల గోవిందరావు ఇటీవల ఆకస్మికంగా మృతి చెందటంతో ఆయన కుటుంబాన్ని సోమవారం రాజాం ఎమ్మెల్యే కోండ్రు మురళీ మోహనరావు, ఆయన సోదరుడు జగదీశ్ పరామర్శించారు.

# ఏ సమస్య ఉన్నా తెలియజేయండి

● మంత్రి సంధ్యారాణి



గర్భిణుల సమస్యలు తెలుసుకుంటున్న మంత్రి

సాలూరు, జనవరి 27 (ఆంధ్రజ్యోతి): గర్భంతో ఉన్న మహిళ గర్భగుడిలో ఉన్న దేవతతో సమానం అని.. గిరిశిఖర గ్రామాల గర్భిణుల వసతిగృహంతో ఉన్న గర్భిణులకు ఏ సమస్య వచ్చినా తనకు తెలియజేయాలని మంత్రి గుమ్మిడి సంధ్యారాణి అన్నారు. పట్టణంలోని వైటీసీలో గల గర్భిణుల వసతి గృహాన్ని ఆమె సోమవారం పరిశీలించారు. గర్భిణుల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. మినరల్ వాటర్ క్యాన్‌లతో నీటిని తీసుకుని వెళ్లి వారికి అందజేశారు. పాడైన ఆర్వో ప్లాంట్‌కు మరమ్మతులు చేయించారు. వసతి గృహంలో ఎలాంటి సమస్యలు ఉన్నా తక్షణం తన దృష్టికి తీసుకుని రావాలని ఆధికారులకు ఆదేశించారు. గర్భిణులు ప్రసవం అయి ఇంటికి వెళ్లే వరకు అధికారులు తగు జాగ్రత్తలు తీసుకోవాలని ఆమె సూచించారు. తమకు జీతాలు సరిగ్గా అందడం లేదని సిబ్బంది మంత్రి దృష్టికి తీసుకు వచ్చారు. ఉన్నాతాధికారులతో మాట్లాడి జీతాలు త్వరలో జమ అయ్యేలా చూస్తానని మంత్రి హామీ ఇచ్చారు. ఆమె వెంట గిరిజన సంక్షేమ శాఖ డిప్యూటీ డైరెక్టర్ ఆర్.కృష్ణవేణి, వైటీసీ మేనేజర్ విద్యాసాగర్, టీడీపీ నాయకులు నిమ్మాది తిరుపతిరావు, ఆముదాల పరమేష్ ఉన్నారు.

# భవిష్యత్తును ఉజ్వలంగా మార్చుకోండి

కురుపాం, జనవరి27(ఆంధ్రజ్యోతి): జాబ్ మేళాలో ఉద్యోగాలు పొందే యువత, వారి భవిష్యత్తు ఉజ్వలంగా మార్చుకోవాలని కలెక్టర్ ఎ.శ్యామ్‌ప్రసాద్ పిలుపునిచ్చారు. సోమవారం కురుపాం జూనియర్ కళాశాల ఆవరణలో రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో సంకల్ప్ మెగా జాబ్ మేళా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో కలెక్టర్‌తో పాటు ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే తోయక జగదీశ్వరి ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ జాబ్‌మేళాలో 24 ప్రైవేటు కంపెనీ ప్రతినిధులు పాల్గొన్నారు. ఈసందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ యువత ముందుగా ఉపాధి చూసుకోవాలని సూచించారు. తాను కూడా ముందు ఉపాధ్యాయుడిగా ఉద్యోగంలో చేరి, తర్వాత ఐఏఎస్ అయ్యానని తెలిపారు. ఈ శిబిరంలో పలువురు విద్యార్థులు గ్రూపు-1, గ్రూపు-2 మెటీరియల్ కావాలని కోరారు. అలాగే అందజేస్తామని ఆయన హామీ ఇచ్చారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ నిరుద్యోగులు జాబ్‌మేళాను వినియోగించుకోవాలని అన్నారు. ఈ జాబ్ మేళాకు 282 మంది నిరుద్యోగులు హాజరు కాగా, 68మంది ఎంపికయ్యారు.

**కుట్టుమిషన్ల పంపిణీ**

గిరిశక్తి పథకంలో భాగంగా వందన వికాస్ కేంద్రాలకు కురుపాం, గుమ్మలక్ష్మీపురం, జియ్యమ్మవలస, కొమరాడ మండలాలకు చెందిన 8 కుట్టు మిషన్లను కలెక్టర్, ఎమ్మెల్యే అందజేశారు. జిల్లా నైపుణ్యాభివృద్ధి అధికారి కె.సాయికృష్ణ చైతన్య, కళాశాల ప్రిన్సిపాల్ ఉషారాణి, తెలుగు యువత అధికారి అధికార ప్రతినిధి కోలా రంజిత్‌కుమార్, జనసేన నియోజకవర్గం ఇన్‌చార్జి కడ్రక మల్లేశ్వరరావు, టీడీపీ మండల కన్వీనర్ కేవీ కొండయ్య, మాజీ ఎంపీపీ జీ.వి.రమణమూర్తి, అధికారులు పాల్గొన్నారు.

# రాజకీయ వేధింపులు ఆపాలి



కలెక్టరేట్ వద్ద నిరసన తెలుపుతున్న డ్వాక్రా మహిళలు

బెలగాం, జనవరి 27 (ఆంధ్రజ్యోతి): డ్వాక్రా మహిళా సంఘాలు, గ్రామ సంఘాల ఆధ్వర్యంలో జరిగే వీవోఏల ఎన్నికల విషయంలో రాజకీయ వేధింపులు తగవని గిరిజన సంఘం, వ్యవసాయ కార్మిక సంఘం నాయకులు డిమాండ్ చేశారు. ఈ మేరకు సోమవారం పార్వతీపురంలోని కలెక్టరేట్ వద్ద డ్వాక్రా మహిళలతో కలిసి ఆందోళన చేపట్టారు. అనంతరం జేసీ శోభికకు వినతిపత్రం అందజేశారు. ఈసందర్భంగా వామపక్ష నాయకుడు కొల్లి గంగునాయుడు మాట్లాడుతూ పార్వతీపురం మండలం రావికోన పంచాయతీ, చొక్కాపువాని వలస పంచాయతీ సంగంవలసలో గల కొన్ని గ్రామాలను కలుపుకొని అడ్డారువలసలో వెలుగు సీసీ ఆధ్వర్యంలో జరిగిన ఎన్నికల్లో గిరిజనులను ఎన్నికోవల్సి ఉండగా టీడీపీ వారిని ఎన్నికున్నారని తెలిపారు. ఇది రాజకీయ కక్షతో జరిగిందని చెప్పారు. ఈ కార్యక్రమంలో పలు ప్రజా సంఘాల నాయకులు, డ్వాక్రా మహిళలు పాల్గొన్నారు.

## టౌన్ ప్లానింగ్ విభాగంలో పారదర్శకత పాటించాలి

బొబ్బిలి, జనవరి 27 (ఆంధ్రజ్యోతి): బొబ్బిలి టౌన్ ప్లానింగ్ విభాగంలో పారదర్శకత పాటించాలని లోక్‌సత్తా పార్టీ జిల్లా అధ్యక్షుడు ఆకుల దామోదరరావు డిమాండ్ చేశారు. సోమవారం ఆయన స్థానిక విలేకర్లతో మాట్లాడారు. 2022లో అవినీతి నిరోధక శాఖ అధికారులు జరిపిన తనిఖీల్లో పలు అక్రమాలు జరిగినట్లు గుర్తించడంతో ఏకంగా మంది అధికారులకు తాఖీదులు జారీ చేయడం సిగ్గు చేటని అన్నారు. నిబంధనలకు విరుద్ధంగా బహుళ అంతస్తు భవనాలు నిర్మిస్తున్నారని ఆయన ఆరోపించారు. టౌన్ ప్లానింగ్ విభాగంలో పలు విధానాలను అమలు చేస్తున్నట్లు మున్సిపల్ కమీషనరు ప్రకటించడం హర్షణీయమని, ఈ ప్రకటనలను కార్యరూపంలో అమలు చేయాలని ఆయన డిమాండ్ చేశారు.

# మధ్యాహ్న భోజన కార్మికుల ధర్నా



ధర్నా చేస్తున్న ఎండీఎం నిర్వాహకులు

శృంగవరపుకోట, జనవరి 27 (ఆంధ్రజ్యోతి): స్థానిక మండల విద్యాశాఖాదికారి కార్యాలయం ఎదుట సోమవారం సీఐటీయూ ఆధ్వర్యంలో మధ్యాహ్న బోజన పథకం నిర్వాహకులు ధర్నా చేశారు. సీఐటీయూ జిల్లా కార్యదర్శి మద్దిల రమణ మట్లాడుతూ పాఠశాలల్లో చదివే 9, 10 తరగతుల విద్యార్థులకు కార్మికులు వండి వడ్డిస్తున్నా ఎటువంటి నగదు చెల్లించడం లేదన్నారు. ఈ పిల్లలను లెక్కలోకి తీసుకుని వారికి జీతాలు ఇవ్వాలన్నారు. కార్యక్రమంలో మధ్యాహ్న భోజన పథకం యూనియన్ నాయకులు బంగారమ్మ, లక్ష్మి, భవానీ తదితరులున్నారు.

# రెండు మద్యం దుకాణాల మంజూరు

బొబ్బిలి, జనవరి 27 (ఆంధ్రజ్యోతి): బొబ్బిలి పట్టణంలో ఒకటి, మండలంలో ఒకటి చొప్పున రెండు మద్యం దుకాణాలు యాత కులానికి మంజూరైనట్టు ఎక్సైజ్ సీఐ పి.చిన్నంనాయుడు తెలిపారు. జిల్లా వ్యాప్తంగా శెట్టిబలిజ, యాత, సెగిడి కులాల వారికి 15 షాపులు మంజూరు కాగా, అందులో రెండు బొబ్బిలికి చెందిన యాత కులస్థులకు మంజూరయ్యాయన్నారు. ఆసక్తి కలిగిన వారు వచ్చే నెల 5 లోగా రూ.2లక్షల నాన్ రిఫండ్‌బుల్ డిపాజిట్‌ను చెల్లించి దరఖాస్తు చేసుకోవచ్చన్నారు. కలెక్టర్ సమక్షంలో వచ్చే నెల 7న లాటరీ పద్ధతిలో షాపుల కేటాయింపు ఉంటుందని ఆయన తెలిపారు.

# పేరుకే పాఠశాల

● నెల రోజులుగా రాని ఉపాధ్యాయుడు
● సొంత భవనం లేని వైనం
● ఇదీ దెబ్బలగూడ గిరిజన సంక్షేమ ప్రాథమిక పాఠశాల దుస్థితి

గుమ్మలక్ష్మీపురం, జనవరి 27 (ఆంధ్రజ్యోతి): దెబ్బలగూడ గిరిజన సంక్షేమ ప్రాథమిక పాఠశాల.. పేరుకే పాఠశాల కానీ సొంత భవనం కూడా లేదు. గత నెల రోజులుగా ఉపాధ్యాయుడు కూడా రావడం లేదు. గొయ్యిపాక పంచాయతీ పరిధిలోని దెబ్బలగూడలో మొదటి నుంచి ఓ ఇంట్లోనే పాఠశాలను నిర్వహిస్తున్నారు. అయితే గత నెల రోజులుగా ఉపాధ్యాయుడు రాకపోవడంతో విద్యార్థుల చదువులు అటకెక్కాయి. వారు ఇళ్లకే పరిమితమవుతున్నారు. అప్పడప్పుడు పాఠశాలకు వెళ్తున్నారు. ఈ విషయం సంబంధిత అధికారులకు తెలిసినా స్పందన లేదని గొయ్యిపాక సర్పంచ్ కళావతి ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. గిరిజన సంక్షేమ శాఖ అధికారులు స్పందించి పాఠశాలకు ఉపాధ్యాయుడిని నియమించాలని విద్యార్థుల తల్లిదండ్రులు కోరుతున్నారు. అలాగే భవనాన్ని నిర్మించాలని విజ్ఞప్తి చేస్తున్నారు.

**అధికారుల దృష్టికి తీసుకు వెళ్లాం**

పాఠశాలకు ఉపాధ్యాయుడు వచ్చేలా చూడాలని సంబంధిత అధికారులను విజ్ఞప్తి చేశాం. పాఠశాల మూతపడిన విషయాన్ని ఇటీవల మండల సర్వసభ్య సమావేశంలో ప్రస్తావించాం. గతంలో పాఠశాల భవనం మంజూరు చేయాలని ఐటీడీఏ పీవోని కోరాం. ఇంతవరకు మంజూరు చేయలేదు.

**- కళావతి, సర్పంచ్, గొయ్యిపాక**

**డెప్యుటేషన్‌కు పంపించాం**

దెబ్బగూడ పాఠశాల ఉపాధ్యాయుడిని దుడ్డుకళ్ల ఆశ్రమ పాఠశాలకు డెప్యుటేషన్‌పై పంపించాం.



ఉపాధ్యాయుడు లేకుండా చదువుకుంటున్న విద్యార్థులు

ఉపాధ్యాయుడిని నియమించేవరకు విద్యార్థులను సమీపంలోని బీరుపాడు పాఠశాలకు పంపాలని వారి తల్లిదండ్రులను కోరాం. ప్రభుత్వం నుంచి నిధులు మంజూరైతే పాఠశాలను నిర్మిస్తాం.

**- సురేష్‌కుమార్, ఏటీడబ్ల్యువో**

# అర్జీలను చిత్తశుద్ధితో పరిష్కరించాలి

● కలెక్టర్ శ్యాంప్రసాద్
● పీజీఆర్ఎస్‌కు 105 వినతులు

పార్వతీపురం, జనవరి 27 (ఆంధ్రజ్యోతి): ప్రజా సమస్యల పరిష్కార వేదిక (పీజీఆర్ఎస్)కు వచ్చే అర్జీలను చిత్తశుద్ధితో పరిష్కరించాలని కలెక్టర్ ఎ.శ్యామ్‌ప్రసాద్ జిల్లా అధికారులకు దిశా నిర్దేశం చేశారు. సోమవారం స్థానిక కలెక్టర్ కార్యాలయ సమావేశ మందిరంలో ఆయన అధ్యక్షతన పీజీఆర్ఎస్ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో కలెక్టర్.. 105 వినతులను స్వీకరించి, తదుపరి చర్యల నిమిత్తం అధికారులను ఆదేశించారు. కురుపాం మండలం గాండిలోవ గ్రామానికి రోడ్డు సౌకర్యం కల్పించాలని ఆ గ్రామస్థులు కోరారు. గరుగుబిల్లి మండలం కొంకడివరం నుంచి శివరాంపురం వరకు ఉన్న రహదారిని పునరుద్ధరించాలని ఆయా గ్రామస్థులు కోరారు. ఇలా మరికొన్ని వినతులు అందాయి. ఐటీడీఏ పీవో అశుతోష్ శ్రీవాస్తవ, డీఆర్వో కె.హేమలత, అధికారులు పాల్గొన్నారు.

**ఎస్పీ పీజీఆర్ఎస్‌కు 9 వినతులు**

బెలగాం, జనవరి 27 (ఆంధ్రజ్యోతి): ప్రజా సమస్యల పరిష్కార వేదికకు వచ్చిన ఫిర్యాదులను సత్వరం పరిష్కరించాలని ఎస్పీ ఎస్‌వీ మాధవరెడ్డి ఆదేశించారు. సోమవారం స్థానిక జిల్లా పోలీస్ కార్యాలయంలో ఎస్పీ ఆధ్వర్యంలో పీజీఆర్ఎస్ నిర్వహించారు. మొత్తం తొమ్మిది ఫిర్యాదులు అందినట్టు ఎస్పీ తెలిపారు. ఫిర్యాదుదారులతో ఎస్పీ మాట్లాడి, వారి సమస్యలను తెలుసుకున్నారు.



పార్వతీపురం: వినతులు పరిశీలిస్తున్న కలెక్టర్

బాధితులకు న్యాయం చేయాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. డీసీఆర్‌బీ హెచ్‌సీ తాతబాబు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

**ఐటీడీఏ గ్రీవెన్స్‌కు 65..**

సీతంపేట రూరల్, జనవరి 27(ఆంధ్రజ్యోతి): స్థానిక ఐటీడీఏ కార్యాలయంలో ఇన్‌చార్జి పీవో సి.యశ్వంత్ కుమార్‌రెడ్డి ఆధ్వర్యంలో సోమవారం ప్రజా సమస్యల పరిష్కార వేదిక నిర్వహించారు. బొడ్డగూడలో తాగునీటి సౌకర్యం కల్పించాలని అప్పలనాయుడు కోరారు. గజిలి గ్రామంలో అసంపూర్తి ఉన్న కమ్యూనిటీ భవన నిర్మాణాన్ని పూర్తిచేయాలని సవర సువార్త కోరారు. ఇలా అనేక సమస్యల పరిష్కారం కోరుతూ 65 వినతులు వచ్చాయి. డీడీ అన్నదొర, డిప్యూటి డీఇవో రవి ప్రసన్నకుమార్, ఆర్‌డబ్ల్యూ ఎస్ డీఈ మధుసూదనరావు, పీహెచ్‌వో వెంకటగణేష్, జీసీడీవో రాములమ్మ పాల్గొన్నారు.



బెలగాం: ఫిర్యాదులను స్వీకరిస్తున్న ఎస్పీ మాధవరెడ్డి



సీతంపేటరూరల్: వినతులు స్వీకరిస్తున్న ఐటీడీఏ పీవో యశ్వంత్‌కుమార్‌రెడ్డి

## దావోస్ సదస్సులో ప్రత్యేక ఆకర్షణగా ఏపీ

● బొబ్బిలి ఎమ్మెల్యే బేబీ నాయన

బొబ్బిలి, జనవరి 27 (ఆంధ్రజ్యోతి): ఇటీవల దావోస్‌లో జరిగిన వరల్డ్ ఎకనామిక్ ఫోరం సదస్సులో ఆంధ్రప్రదేశ్ ఓ ప్రత్యేక ఆకర్షణగా నిలిచిందని, ఇది ముఖ్యమంత్రి చంద్రబాబు పరిపాలనా దక్షతకు నిదర్శనమని బొబ్బిలి ఎమ్మెల్యే బేబీనాయన అన్నారు. ఈ మేరకు సోమవారం ఆయన ఓ ప్రకటన విడుదల చేశారు. 20 లక్షలమందికి ఉద్యోగ అవకాశాలు కల్పించాలన్న తపన చంద్రబాబు, లోకేశ్‌లో చాలా స్పష్టంగా కనిపిస్తోందన్నారు. బిల్‌గేట్స్, టాటా ఛైర్మన్ చంద్రశేఖరన్ వంటి ప్రపంచ దిగ్గజాలు చంద్రబాబు విజన్‌ను మెచ్చుకుని పెట్టుబడులు పెట్టేందుకు సుముఖత వ్యక్తం చేయడం హర్షణీయం అన్నారు.

## గుంతను పూడ్చారు

బొబ్బిలి, జనవరి 27 (ఆంధ్రజ్యోతి): పట్టణ పరిధిలోని బొబ్బిలి-పార్వతీపురం రహదారిలో స్థానిక సాయినగర్ వద్ద ఏర్పడిన పెద్ద గుంతపై ఇటీవల ఆంధ్రజ్యోతిలో కథనం ప్రచురితమయ్యింది. దీనిపై స్థానిక పోలీసులు స్పందించారు. సీఐ కటకం సతీష్‌కుమార్ ఆధ్వర్యంలో ఆ గుంతను సోమవారం పూడ్చించారు. ఎస్ఐ జ్ఞానప్రసాద్, ఏఎస్ఐ ఆదిత్యులు దగ్గరుండి ఈ పనులను నిర్వహించారు.

ఆంధ్రజ్యోతి ఎఫెక్ట్

## రోడ్డు పనుల్లో నాణ్యత ప్రమాణాలు పాటించాలి

బొబ్బిలి, జనవరి 27 (ఆంధ్రజ్యోతి): బొబ్బిలి పట్టణ పరిధిలోని 21వ వార్డు నాయుడు కాలనీలో గల పలు వీధుల్లో చేపడుతున్న సీసీ రోడ్డు పనులను మున్సిపల్ ఛైర్మన్ సావు వెంకటమురళీకృష్ణారావు సోమవారం పరిశీలించారు. పనుల్లో నాణ్యతా ప్రమాణాలను పాటించాలని ఆయన ఇంజినీరింగ్ అధికారులను ఆదేశించారు. ఆయన వెంట డీఈఈ కిరణ్‌కుమార్, ఏఈ రవికుమార్, సచివాలయ సిబ్బంది, వార్డు పెద్దలు పాల్గొన్నారు.

## గడ్డి కుప్పలు దగ్ధం

బాడంగి, జనవరి 27(ఆంధ్రజ్యోతి): భీమవరం గ్రామంలో తెర్లి శ్రీనుకు చెందిన రూ.20వేలు విలువ గల మూడు గడ్డి కుప్పలు సోమవారం అగ్నికి ఆహుతయ్యాయి. ప్రమాదానికి కారణాలు తెలియ రాలేదు. అగ్నిమాపక సిబ్బంది వచ్చి మంటలను అదుపు చేశారు.

## కలెక్టర్ వీసీలో మండలాధికారులు

బొబ్బిలి రూరల్, జనవరి 27 (ఆంధ్రజ్యోతి): స్పందనలో వచ్చే ఫిర్యాదులను తక్షణమే పరిష్కరించాలని కలెక్టర్ బీఆర్ అంబేడ్కర్ సూచించారు. సోమవారం గ్రీవెన్స్ సందర్భంగా మండల అధికారులతో ఆయన వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. బొబ్బిలి ఎంపీడీవో కార్యాలయంలో మండల అధికారులు ఈ వీసీలో పాల్గొన్నారు.

# ఎమ్మెల్యేపై ఆరోపణలు అర్ధరహితం

● టీడీపీ న్యాయ విభాగం అధ్యక్షుడు గోపాలకృష్ణశర్మ

బొబ్బిలి, జనవరి 27 (ఆంధ్రజ్యోతి): బొబ్బిలి పట్టణ పరిధిలోని గొల్లపల్లి రెవెన్యూలో గల భూములను స్థానిక ఎమ్మెల్యే బేబీనాయన ఆక్రమించుకున్నారని కొంతమంది ఆరోపణలు చేస్తూ లోకాయుక్తకు ఫిర్యాదు చేయడం అర్ధరహితమని టీడీపీ న్యాయ విభాగం అధ్యక్షుడు గంటి గోపాలకృష్ణశర్మ అన్నారు. సోమవారం బొబ్బిలిలోని తన కార్యాలయంలో ఆయన విలేకర్లతో మాట్లాడారు. గొల్లప ల్లి రెవెన్యూ 632, 633, 634 సర్వే నెంబరులో గల భూ ములపై కొంత మంది దురుద్దేశ పూర్వకంగా ఆరోపణలు చేస్తున్నారన్నారు. 2018లో హైకోర్టు ఆదేశాల మేరకు ఆర్డీవో సుమారు 8 ఎకరాల అదనపు భూములను బొబ్బిలి రాజా ఆర్‌వీజీకే రంగారావుకు దాఖలు పరిచారన్నారు. ఈ మేరకు ఆ భూములు రాజవంశీ యులైన మాజీ మంత్రి సుజయ్ కృష్ణరంగారావు, రామ్‌నాయన, బేబీనాయ నలకు హక్కు దాఖలా అయి మ్యూటేషన్ జరిగిందన్నారు. ఈ ముగ్గురి సోదరులకు రెవెన్యూ అధికారులు అప్పగించారని ఆయన తెలిపారు. ఆరోపణలు చేస్తున్న వ్యక్తులు పేర్కొన్న భూములు అవి కావని ఆయన స్పష్టం చేశారు. వారు చెప్పిన భూములు ఇందిరమ్మ కాలనీ, జగనన్న కాలనీలకు వెళ్లాయన్నారు. వాటి ఎదురుగా ఖాళీగా ఉన్న రాజుల భూములు తమవేనని వారు పేర్కొనడం సబబు కాదన్నారు. సర్వే నెం.619/2ఎ ప్రకారం బొబ్బిలి రాజవం శీయులకు ఆ ఎనిమిది ఎకరాల భూములు చాలా స్పష్టంగా దాఖలు పడ్డాయన్నారు.



మాట్లాడుతున్న గోపాలకృష్ణ

# విశాఖ డెయిరీ సమావేశం రసాభాస

● మధ్యలోనే వెళ్లిపోయిన బోర్డు డైరెక్టర్

రామభద్రపురం, జనవరి 27(ఆంధ్రజ్యోతి): విశాఖ డెయిరీలో గత కొన్నిరోజులుగా చోటుచేసుకున్న పరిణామాలు, అవకతవకలపై పాడి రైతులు, ఉద్యోగులు, పాల సేకరణ కేంద్రం అధ్యక్షులు ఒక్కసారిగా విరుచుకు పడ్డారు. మండల కేంద్రంలోని విశాఖ డెయిరీ కార్యాలయంలో సోమవారం జరిగిన సమావేశం రసాభాసగా మారింది. విశాఖ డెయిరీ బోర్డు డైరెక్టర్ పిల్లా రమాకుమారి ఆధ్వర్యంలో జరిగిన ఈ సమావేశంలో ఆమె ప్రసంగిస్తుండగా కొంతమంది పాడిరైతులు, అధ్యక్షులు అడ్డు పడ్డారు. దీంతో ఆమె సభ మధ్యలో ఆవేశంగా వెళ్లిపోయారు. గతంలో ఉన్న విశాఖ డెయిరీని భ్రష్టుపట్టించి ఈ పాలకవర్గం రైతుల జీవితాలతో చెలగాటం ఆడుతోందని ఆరోపించారు. పాల రేటు తగ్గించడమే కాకుండా 30 లీటర్లు తక్కువ ఉన్న సెంటర్లు మూసి వేయాలని, వారానికి ఒకసారి పాలు సరఫరా చేయకుండా హాలిడే ప్రకటించాలని, 5 లీటర్లు ఇస్తున్న పాడి రైతులకు తిరిగి ఒక లీటరు పట్టుకెళ్లిపోవాలని ఇటువంటి దుర్మార్గమైన చర్యలు నిరసిస్తూ ఒక్కసారిగా ఆమెపై విరుచుకుపడ్డారు. దీంతో డెయిరీ సిబ్బంది, పాడి రైతులు, ఉద్యోగుల మధ్య తీవ్ర స్థాయిలో వాగ్వాదం చోటుచేసుకుంది. కొంతమంది డెయిరీ సిబ్బంది డైరెక్టర్‌కు నచ్చజెప్పి మళ్లీ సభాస్థలికి తీసుకువచ్చి మాట్లాడించే ప్రయత్నం చేశారు. ఈ సందర్భంగా ఆమె కంటతడి పెడుతూ.. పాడి రైతుల సంక్షేమం కోసం విశాఖడెయిరీ ఎంతో కృషి చేస్తుందని నచ్చజెప్పే ప్రయత్నం చేసినప్పటికీ పాడి రైతులు కేకలు వేస్తునే ఉన్నారు. దీంతో సమావేశాన్ని అర్థాంతరంగా ముగించారు.



సభ నుంచి వెళ్లిపోతున్న విశాఖ డెయిరీ బోర్డు డైరెక్టర్ రమాకుమారి

## తప్పులపై ప్రశ్నిస్తే తొలగిస్తారా?

రామభద్రపురం, జనవరి 27(ఆంధ్రజ్యోతి): మండల సమాఖ్యలో జరుగుతున్న వివిధ అవకతవకలు ప్రశ్నించినందుకు తనను పదవి నుంచి తొలగించి మానసిక క్షోభకు గురిచేయడం ఎంతవరకు సమంజసమని సమాఖ్య అధ్యక్షురాలు కిల్లాడ అరుణ ప్రశ్నించారు. ఈ మేరకు సోమవారం ఆమె డీఆర్‌డీఏ పీడీకి వినతిపత్రం రాసి, విలేకర్లకు చూపించారు. తాను ఏ తప్పు చేయకుండా ఏ విధంగా తొలగిస్తారని ఆవేదన వ్యక్తం చేశారు. ఇటీవల మండల సమాఖ్యలో ఖర్చులు, లావాదేవీలు అడిగినందుకు ఈ నిర్ణయం తీసుకున్నారని, అయితే ఏ పదవికైనా కాల పరిమితి ఉంటుందని, కనీసం ఆరు నెలలు కాకముందే ఈ విధంగా తనను తొలగించడం సబబు కాదన్నారు. దీనిపై అధికారులు స్పందించి తనకు న్యాయం చేయాలని కోరారు. ● దీనిపై వెలుగు ఏపీఎం అన్నపూర్ణను వివరణ కోరగా నిబంధనల ప్రకారమే మండల సమాఖ్యలో మార్పులు, చేర్పులు జరుగుతాయని, సభ్యులంతా తీర్మానం చేసిన తర్వాతే తొలగిస్తారని తెలిపారు.



డీఆర్‌డీఏ పీడీకి రాసిన వినతిపత్రాన్ని చూపిస్తున్న అరుణ

## పంచాయతీల అధికారాలను కుదించడం తగదు

రామభద్రపురం, జనవరి 27(ఆంధ్రజ్యోతి): పంచాయతీల అధికారాలను కుదించడం ఎంతవరకు సమంజసమని జిల్లా పంచాయతీ సర్పంచ్‌ల సంఘం అధ్యక్షుడు మజ్జి రాంబాబు ప్రశ్నించారు. సోమవారం స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో ఆయన విలేకర్లతో మాట్లాడారు. గత ప్రభుత్వం చేస్తున్న తప్పుడు విధానాలనే ఈ కూటమి ప్రభుత్వం చేస్తూ సర్పంచ్‌లకు ఎటువంటి అధికారాలు లేకుండా చేస్తోందని ఆరోపించారు. ప్రజల అవసరాలు, సర్పంచ్‌ల ఆకాంక్షలకు అనుగుణంగా జీవోలు విడుదల చేయాలని కోరారు. రేషనలైజేషన్‌లో కూడా సచివాలయ సిబ్బందిని సర్పంచ్‌ల ఆధీనంలో ఉండేటట్లు చూడాలని తెలిపారు. పాతరేగ సర్పంచ్ ప్రతినిధి గొట్టాపు పైడిపునాయుడు, దుప్పలపూడి సర్పంచ్ వైకుంఠం విజయభాస్కరరావు, నాయుడువలస సర్పంచ్ ప్రతినిధి నడిమింటి సత్యం పాల్గొన్నారు.

# కేటాయించిన భూములు అప్పగించాలి

గరుగుబిల్లి, జనవరి 27 (ఆంధ్రజ్యోతి): గొట్టివలస రెవెన్యూ పరిధిలో రైతులకు కేటాయించిన భూములను అప్పగించాలని పలువురు కోరారు. ఈ మేరకు సోమవారం స్థానిక రెవెన్యూ కార్యాలయంలో నిర్వహించిన పీజీఆర్ఎస్‌లో తహసీల్దార్ పి.బాలకు వినతిపత్రం అందించారు. దీనిపై విచారణ చేసి సమస్యను ఉన్నతాధికారులకు నివేదిస్తానని తహసీల్దార్ తెలిపారు. ఆర్ఐ శ్రీనివాస్ గౌరీప్రసాద్, వీఆర్వోలు పాల్గొన్నారు.

## న్యూస్ బాక్స్

**దివ్యాంగుడికి ట్రై సైకిల్ పంపిణీ**

పార్వతీపురం, జనవరి27 (ఆంధ్రజ్యోతి): సీతానగరం మండలం కోటసీతారాంపురం గ్రామానికి చెందిన సీతారాములు అనే దివ్యాంగుడికి కలెక్టర్ శ్యామ్‌ప్రసాద్ ట్రై సైకిల్ పంపిణీ చేశారు. సోమవారం స్థానిక కలెక్టర్ కార్యాలయ సమావేశ మందిరంలో పీజీఆర్ఎస్ నిర్వహించారు. ఈ కార్యక్రమానికి సీతారాములు వచ్చి, తనకు 80 ఏళ్ల వయస్సు అని, దివ్యాంగుడినని, ట్రై సైకిల్ మంజూరు చేయాలని కోరాడు. దీంతో కలెక్టర్.. ట్రై సైకిల్ మంజూరు చేయించి సీతారాములుకు అందజేశారు. దివ్యాంగుల సంక్షేమ శాఖ ప్రతినిధులు పాల్గొన్నారు.

**సదస్సును జయప్రదం చేయాలి**

పాలకొండ, జనవరి 27 (ఆంధ్రజ్యోతి): మహిళలపై జరుగుతున్న అత్యాచారాలు, హత్యలపై వచ్చే నెల 9న నిర్వహించనున్న సదస్సును జయప్రదం చేయాలని అఖిల భారత ప్రజాతంత్ర మహిళా సంఘం జిల్లా కార్యదర్శి రెడ్డి శ్రీదేవి కోరారు. ఈ మేరకు సోమవారం స్థానిక నగర పంచాయతీ కార్యాలయం వద్ద పోస్టర్ ఆవిష్కరించారు. వాసవీ తిరుమల కల్యాణ మండపంలో ఉదయం 10 గంటలకు సదస్సు ఉంటుందని తెలిపారు.

**డంపింగ్‌యార్డుకు స్థలం కేటాయించాలి**

పాలకొండ, జనవరి 27 (ఆంధ్రజ్యోతి): పాలకొండ నగర పంచాయతీలో డంపింగ్ యార్డుకు స్థలం కేటాయించాలని నగర పంచాయతీ పాలకవర్గ సభ్యులు కోరారు. ఈ మేరకు పార్వతీపురం కలెక్టరేట్‌లో సోమవారం నిర్వహించిన పీజీఆర్ఎస్‌లో డీఆర్వో హేమలతకు వినతిపత్రం అందించారు. ఈ సమస్యను పరిష్కరించాలని కోరారు.

**రోడ్డు నిబంధనలు పాటించాలి**

పాలకొండ, జనవరి 27 (ఆంధ్రజ్యోతి): వాహన చోదకులు రోడ్డు నిబంధనలు విధిగా పాటించాలని ఆర్టీవో టి.వేణుగోపాలరావు అన్నారు. జాతీయ రహదారి భద్రతా మాసోత్సవాల్లో భాగంగా సోమవారం స్థానిక ఆర్టీవో కార్యాలయంలో పలు ప్రైవేటు పాఠశాలల బస్సు డ్రైవర్లతో ఆయన సమావేశం నిర్వహించి, రోడ్డు భద్రతపై అవగాహన కల్పించారు. మద్యం తాగి, మొబైల్ ఫోన్‌లో మాట్లాడుతూ వాహనాలు నడపవద్దని సూచించారు. అసిస్టెంట్ ఎంవీఐ, సిబ్బంది పాల్గొన్నారు.

**సీతంపేట ఆర్ఐ బదిలీ**

సీతంపేట రూరల్, జనవరి 27(ఆంధ్రజ్యోతి): సీతంపేట తహసీల్దార్ కార్యాలయంలో ఆర్ఐగా విధులు నిర్వహిస్తున్న ఎస్.వెంకటేష్‌కు బదిలీ అయ్యింది. సుమారు మూడేళ్ల కాలం పాటు సీతంపేట ఆర్ఐగా పనిచేసిన వెంకటేష్‌ను పాలకొండ సబ్ కలెక్టర్ కార్యాలయ సీనియర్ అసిస్టెంట్‌గా బదిలీ చేస్తూ ఆదేశాలు అందాయి. ఆయన స్థానంలో వీరఘట్టం మండల తహసీల్దార్ కార్యాలయంలో టైపిస్ట్‌గా పనిచేస్తున్న విజయగణేష్ రానున్నట్లు తహశీల్దార్ అప్పలరాజు తెలిపారు.

**పాడి రైతుల ఆర్థికాభివృద్ధికి కృషి**

వీరఘట్టం, జనవరి 27 (ఆంధ్రజ్యోతి): ఎం.రాజపురంలో సోమవారం పశు సంవర్ధక శాఖ ఆధ్వర్యంలో పశు ఆరోగ్య శిబిరాన్ని ఎమ్మెల్యే నిమ్మక జయకృష్ణ ప్రారంభించారు. జిల్లా పశుసంవర్ధక శాఖ అధికారి మన్మథరావు, పాలకొండ సహాయ సంచాలకుడు మాణిక్యాలరావు, వీరఘట్టం పశువైద్యాధికారి పి.చైతన్య తదితరులు పాల్గొన్నారు.

**నేడు సామాజిక తనిఖీ ప్రజావేదిక**

భామిని, జనవరి 27 (ఆంధ్రజ్యోతి): స్థానిక మండల పరిషత్ కార్యాలయం ప్రాంగణంలో 17వ విడత సామాజిక తనిఖీ ప్రజా వేదిక మంగళవారం నిర్వహిస్తున్నట్టు ఎంపీడీవో సత్యం తెలిపారు. ఈ కార్యక్రమంలో ప్రజాప్రతినిధులు, సంబంధిత అధికారులు హాజరు కావాలని ఆయన కోరారు.

**అంగన్‌వాడీ కేంద్రాలకు మెడికల్ కిట్లు**

కురుపాం, జనవరి27(ఆంధ్రజ్యోతి): కురుపాం ఐసీడీఎస్ పరిధిలో గల 316 అంగన్‌వాడీ కేంద్రలకు ఫస్ట్ ఎయిడ్, పిల్లల ఆరోగ్యం కోసం మెడికల్ కిట్లు పంపిణీ చేస్తున్నట్టు కురుపాం ఐసీడీఎస్ పీవో కె.విజయగౌరి తెలిపారు. ఈసందర్భంగా అంగన్‌వాడీ కేంద్రాలకు సోమవారం పంపిణీ చేశారు.

**పాఠశాల సందర్శన**

బొబ్బిలి రూరల్, జనవరి 27 (ఆంధ్రజ్యోతి): కృష్ణాపురం ఎంపీయూపీ పాఠశాలను ఎంఈవో గొట్టాపు వాసుదేవరావు సోమవారం సందర్శించారు. విద్యార్థుల విద్యా ప్రమాణాలను పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేశారు. ఉపాధ్యాయులకు పలు సూచనలు చేశారు. హాజరు పట్టీని తనిఖీ చేశారు.